

పత్తికొండ ప్రధాన రహదారి

మళ్లీ మొదటికి...!

> పత్తికొండ రహదారి విస్తరణ మళ్లీ మొదటికి వచ్చింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో హడావుడి చేసినా అది ఎన్నికల కోసమే అని తెలిసిపోయింది. ఎన్నికలు సమీపించే సమయంలో సర్వే చేసి డీపీఆర్‌ను ప్రభుత్వానికి పంపారు. పట్టణ విస్తరణను ఓటు బ్యాంకుగా మలుచుకోవడానికే అప్పటి ప్రభుత్వం రహదారి విస్తరణ పనులు చేపట్టేందుకు సిద్ధమైంది. భూములు కోల్పోయేవారికి పరిహారం చెల్లించకుండానే పనులు ప్రారంభించేందుకు సిద్ధం కావడంతో కొందరు బాధితులు న్యాయం కోసం కోర్టును ఆశ్రయించారు. దీంతో రహదారి విస్తరణ పనులు పెండింగ్‌లో పడిపోయాయి. ఎన్నికల తర్వాత రాష్ట్రంలో అధికారం చేపట్టిన టీడీపీ గత ప్రభుత్వ హయాంలో 25 శాతానికి తక్కువ పనులు జరిగిన టెండర్లను రద్దు చేస్తూ జీవో జారీ చేసింది. ఐదు శాతం పనులు పూర్తయినా పత్తికొండ రహదారి విస్తరణ పనులు తిరిగి రద్దు జాబితాలోకి వెళ్లడంతో విస్తరణ అంశం మళ్లీ మొదటికి వచ్చినట్టయింది.

- ఆగిపోయిన రహదారి విస్తరణ
- వైసీపీ అడ్డగోలు సర్వేలతో వ్యతిరేకత
- నిధులు రాకపోయినా హడావుడి చేసిన అప్పటి ఎమ్మెల్యే
- కోర్టుకు వెళ్లి పనులను అడ్డుకున్న బాధితులు
- ప్రభుత్వం జీవో జారీ చేయడంతో నిలిచిన పనులు

పత్తికొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి):

1994 నుంచే ప్రతిపాదనలు..

బ్రిటీష్ హయాంలో గుత్తి నుంచి ఆదోని వరకు ఏర్పాటు చేసిన హైవే రహదారి పత్తికొండ పట్టణం నడిబొడ్డున వెళ్లింది. అప్పట్లో 20 అడుగుల వెడల్పుతో ఈ రహదారిని ఏర్పాటు చేశారు. కాలక్రమంలో పట్టణం విస్తరించడంతోపాటు భారీ వాహనాల రాకపోకలు పెరగడంతో రహదారి ఇబ్బందులు మొదలయ్యాయి. దీంతో 1994లో అప్పటి ఎమ్మెల్యే ఎస్వీ సుబ్బారెడ్డి రహదారి విస్తరణకు సిద్ధంకాగా పలుకారణాలతో ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. దీంతో 1998లో బైపాస్ రోడ్డు ఏర్పాటు చేసి భారీ వాహనాలు పట్టణంలోకి రాకుండా చేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు. 2010 నాటికి పట్టణం మరింత విస్తరించడం కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల రాకపోకలు పెరగడంతో తిరిగి రహదారి ఇబ్బందులు మొదలయ్యాయి. దీంతో 2014లో డిప్యూటీ సీఎం కేఈ క్రిష్ణమూర్తి హయాంలో మున్సిపాలిటీగా మార్పు చేసి రహదారి విస్తరణ చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. అయితే మున్సిపాలిటీ పనులు పెండింగ్‌లో పడడంతో రహదారి విస్తరణ పనులు ముందుకు సాగలేదు. 2019లో ఎమ్మెల్యేగా గెలిచిన కంగాటి శ్రీదేవి తన పుట్టినరోజు వేడుకల్లో ఏడాదిలోగా రహదారి విస్తరణ చేస్తానని హామీ ఇచ్చారు. ఆ తర్వాత నాలుగేళ్లపాటు ఆమె విస్తరణ అంశాన్ని పట్టించుకున్న పాపానపోలేదు. నియోజవకర్గంలో ఎక్కువ శాతం ఓటు బ్యాంకు (30 వేల ఓట్లు) ఉన్న పత్తికొండ పట్టణాన్ని గెలుపు అస్త్రంగా ఎంచుకొని నాలుగేళ్లపాటు పట్టించుకొని రహదారి విస్తరణ అంశాన్ని తిరిగి తెరపైకి తీసుకొచ్చారు.

రద్దు జీవోల జాబితాలో విస్తరణ పనులు

వైసీపీ హయాంలో చేపట్టిన విస్తరణ పనులు ఎన్నికల నోటిఫికేషన్ నాటికి ఐదు శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. అంబేడ్కర్ సర్కిల్ నుంచి ఊరి వాకిలి వరకు గ్రామ పంచాయతీ కాలువలపై నిర్మించిన భవనాలను తొలగించి కాలువలను నిర్మించారు. గ్రామ పంచాయతీ స్థలంలో ఉన్న కట్టడాలు తొలగించినట్లే పరిహారం చెల్లించకుండానే బాధితుల భవనాలను కూల్చి పనులు చేపట్టేందుకు అధికారులు సిద్ధమైనప్పటికీ వారు కోర్టును ఆశ్రయించడంతో పనులు నిలిపివేశారు. తాజాగా టీడీపీ ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం విస్తరణ పనులు 25 శాతం లోపు ఉండడంతో రద్దయ్యాయి.



పత్తికొండ ప్రధాన రహదారి

ప్రజాభిప్రాయం ప్రకారం రహదారిని విస్తరిస్తాం



పత్తికొండ పట్టణంలో సీసీ రహదారులు, మురుగు కాలువల నిర్మాణాలు చేపడుతున్నాం. 50 సంవత్సరాలుగా రహదారికి నోచుకోని తేరుబజార్‌లో సీసీ రహదారులు ఏర్పాటు చేస్తున్నాం. పట్టణంలో రహదారి విస్తరణకు సంబంధించి ప్రజాభిప్రాయాన్ని గౌరవిస్తాం. అందరికీ ఆమోదయోగ్యంగా రహదారి విస్తరణ పనులు చేపడతాం. రహదారి విస్తరణకు సంబంధించి ఆర్‌అండ్‌బీ అధికారులు ఇప్పటికే నివేదికలు ప్రభుత్వానికి పంపారు. ఆయా శాఖల మంత్రులను కలిసి విస్తరణ ఆవశ్యకతను తెలియజేస్తాము. - ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

పారదర్శకత పాటించకపోవడంపై విమర్శలు

పట్టణంలో ఓటు బ్యాంకును పెంచుకునేందుకు రహదారి విస్తరణకు పూనుకున్న అప్పటి ఎమ్మెల్యే సర్వేల విషయంలో పారదర్శకత పాటించలేదన్న విమర్శలు వ్యక్తమయ్యాయి. అంబేడ్కర్ సర్కిల్ నుంచి బస్టాండ్ వరకు 50 అడుగుల వెడల్పు, గుత్తి సర్కిల్ నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు 40 అడుగుల విస్తీర్ణంతో మొత్తం 3.5 కిలో మీటర్ల మేర చేపట్టాల్సిన విస్తరణ పనుల్లో అప్పటి అధికార పార్టీ ఇష్టారాజ్యంగా వ్యవహరించిందన్న ఆరోపణలు ఉన్నాయి. టీడీపీ వర్గానికి చెందిన వ్యక్తుల భవనాల వద్ద అవసరం లేకపోయినా ఎక్కువ భూమి మార్కింగ్ వేయడం, వైసీపీ అనుకూల వర్గాలకు చెందిన ఇళ్ల వద్ద అవసరం ఉన్నా మార్కింగ్ చేయకుండా వదిలేయడం వంటి కారణాలతో సర్వేపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చింది. దీనికి తోడు ప్రజాభిప్రాయ సేకరణ సమావేశాలు మొక్కుబడిగా నిర్వహించడం, అధికారులు నిర్వహిం చాల్సిన సమావేశాల్లో అధికార పార్టీ నాయకులు పాల్గొనడం వంటి కారణాలతో ప్రజలు విసుగెత్తి పోయారు. మొత్తం బాధితులు 250 మంది ఉండగా తమ అనుకూల వర్గానికి చెందిన వారితో విస్తరణకు మద్దతుగా సంతకాలను సేకరించి మిగిలిన వారిపై ఒత్తిడి తేవడంతో వారు న్యాయం కోసం కోర్టును ఆశ్రయించారు. గుత్తి సర్కిల్‌లో వంద అడుగుల మేర రోడ్డును విస్తరించేందుకు సర్వేలు చేయడాన్ని కూడా ప్రజలు వ్యతిరేకించారు. ప్రజా అవసరాల కోసం రహదారిని విస్తరించాలే తప్ప విగ్రహాల ఏర్పాటుకు భవనాలు కూల్చి తమను రోడ్డున పడేయడం ఎంతవరకు న్యాయం అంటూ గుత్తి సర్కిల్‌లో భవనాలు కో ల్పోయే బాధి తులు అధికారుల వద్ద నిరసన వ్యక్తం చేశారు. దీనికితోడు పూర్తిగా భవనాలు కోల్పోయే బాధితులకు పునరావసం కల్పించే అంశాన్ని కూడా అధికారులు పట్టిం చుకోలేదు. దీంతో వారందరూ న్యాయం కోసం కోర్టును ఆశ్రయించారు. దీంతో విస్తరణ పనులు పెండింగ్‌లో పడిపోయాయి.

విస్తరణ కోసం మరోసారి నివేదికలు పంపాం

గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన రహదారి విస్తరణ పనులు ఐదు శాతం మేర మాత్రమే పూర్తయ్యాయి. ప్రభుత్వం తాజాగా జారీ చేసిన జీవో ప్రకారం 25 శాతం తక్కువ పనుల జాబితాలో పత్తికొండ రహదారి విస్తరణ పనులు రద్దయ్యాయి. అయితే పత్తికొండ పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు, రహదారి విస్తరణ అవసరాన్ని తెలియజేస్తూ మరోసారి ప్రభుత్వానికి నివేదికను పంపించాం.

- వెంకటేష్, ఆర్‌అండ్‌బీ ఈఈ

అభ్యంతరాల మధ్య ఆమోదం



- సమస్యలపై ప్రశ్నించిన కార్పొరేటర్లు
- ముగిసిన బడ్జెట్, సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న కమిషనర్ ఎస్. రవీంద్రబాబు

కర్నూలు న్యూసిటీ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థకు సంబంధించి 2024-25 సవరణ బడ్జెట్, 2025-2026 ప్రతిపాదన బడ్జెట్‌కు నగర పాలక కౌన్సిల్‌లో ఆమోదం లభించింది. గురువారం సుంకేసుల రోడ్డులోని నూతన కౌన్సిల్ హాలులో మేయర్ బీవై రామయ్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో కమిషనర్ ఎస్.రవీంద్రబాబు, కార్పొరేటర్లు హాజరయ్యారు. ముందుగా జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం సవరణ, ప్రతిపాదన బడ్జెట్‌ను అకౌంట్స్ విభాగం అధికారి మల్లికార్జున చదివి సభ్యులకు వినిపించారు. ఇందులో భాగంగా కొందరు కార్పొరేటర్లు బడ్జెట్‌పై అభ్యంతరాలను వ్యక్తం చేశారు. అస్సలు బడ్జెట్‌లో కొన్ని విషయాలను ఎందుకు చేర్చారని కొందరు లేవనెత్తారు. కాలనీలలో పార్కులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్లు కోరారు. అదేవిధంగా ఉన్న పార్కులను అభివృద్ధి చేయాలని సభా దృష్టికి తీసుకువచ్చారు.

మిగతా 7వ పేజీలో..

మెరిట్ జాబితా విడుదల

కర్నూలు హాస్పిటల్, జనవరి 30: (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో ఔట్‌సోర్సింగ్ ఎఫ్ఎన్‌వో పోస్టులకు సంబంధించిన మెరిట్ జాబితా వెబ్‌సైట్‌లో ఉంచినట్లు కర్నూలు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 3 ఎఫ్ఎన్‌వో పోస్టులకు సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ, ఎంపిక పూర్తి అయిందన్నారు. మెరిట్ జాబితాను కర్నూలు, నంద్యాల వెబ్‌సైట్‌లలో విడుదల చేశామన్నారు. అభ్యంతరాలు ఉంటే జనవరి 31 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ 5 గంటల్లోగా కర్నూలు జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారికి తెలియజేయాలని సూచించారు.

సెస్సు వసూలులో కర్నూలు టాప్

- సీమలోని 74 మార్కెట్ కమిటీలకు రూ.133.16 కోట్ల సెస్సు వసూలు లక్ష్యం
- ఇప్పటికే రూ.87.20 కోట్ల వసూలు
- మార్చి నాటికి లక్ష్యాన్ని అధిగమించాలి
- జేడీ రామాంజనేయులు

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 30: (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా మార్కెట్ సెస్సు వసూలు రాయలసీమలో మొదటి స్థానంలో ఉందని మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు తెలిపారు. గురువారం కర్నూలు మార్కెట్ యార్డులోని ఏడీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలో మార్కెట్ ఫీజు వసూళ్లపై వివరాలు వెల్లడించారు. జిల్లాలో రూ.35.14 కోట్ల సెస్సు లక్ష్యానికి గాను ఇప్పటికే రూ.26.18 కోట్ల సెస్సు వసూలైందని అన్నారు. రెండో స్థానంలో నంద్యాల జిల్లా ఉందని, ఈ జిల్లాలో రూ.25.05 కోట్ల లక్ష్యానికి గాను రూ.15.42కోట్లు వసూలైందని జేడీ తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్, రబీ సీజన్లలో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటం వల్ల పంటల దిగుబడి బాగా ఉందని, కేంద్రం నిర్ణయించిన మద్దతు ధరలు అందుతున్నాయని అన్నారు. అందువల్ల మార్కెటింగ్ ఫీజు కూడా లక్ష్యానికి మించి వసూలవుతున్నదని అన్నారు. అనంతపురం జిల్లాలో రూ.12 కోట్ల సెస్సు వసూలుకు గాను రూ.7.75 కోట్లు ఇప్పటికి వసూలైందని అన్నారు. చిత్తూరు జిల్లాలో రూ.10.49 కోట్లకు గాను రూ.5.83 కోటు, కడప జిల్లాలో రూ.12.50 కోట్లకుగాను రూ.7.8 కోటు, తిరుపతి జిల్లాలో రూ.23.24 కోట్లకుగాను రూ.12.41 కోట్లు, అన్నమయ్య జిల్లాలో రూ.8.37 కోట్లకు గాను రూ.7.15 కోట్లు వసూలయ్యాయని అన్నారు. సత్యసాయి జిల్లాలో రూ.5.31 కోట్ల లక్ష్యానికి గాను రూ.3.59 కోట్ల సెస్సు వసూలైందని అన్నారు. రాయలసీమలోని 74 మార్కెట్ కమిటీల నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.133.16 కోట్ల సెస్సును వసూలు చేయాలనే లక్ష్యంగా నిర్ణయించామని, డిసెంబరు నెలాఖరుకు రూ.87.20 కోట్లు వసూలైందని అన్నారు. ఈ సంవత్సరం మార్కెట్ ఫీజు లక్ష్యాన్ని అధిగమిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే కోడుమూరు మార్కెట్ కమిటీ యార్డును ప్రారంభిస్తామని అన్నారు. కర్నూలు మార్కెట్ యార్డులో కేంద్రం నిధులతో కోల్డ్ స్టోరేజీ ప్లాంటును నిర్మించి రైతులకు అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు.

పత్తి ధర పతనం



విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడులు

ఆదోని అగ్రికల్చర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం పత్తిధర మరింత పతనమైంది. పత్తి ధర గరిష్ఠంగా క్వింటా రూ.7,350 పలికింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కంటే క్వింటాకు రూ.200 పైగా ధర తగ్గింది. రోజు రోజుకూ పత్తి ధరలు తగ్గుతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తి గింజల ధరలు, దూది ధర తగ్గడం వల్ల స్థానిక మార్కెట్‌లో పత్తి ధరపై ప్రభావం చూపిందని పత్తి వ్యాపారులు తెలిపారు. 1352 క్వింటాళ్ల పత్త విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ. 4106, గరిష్ఠ రూ. 7350 మధ్యధర రూ. 7181 పలికింది.

నిధులివ్వకపోతే నిర్వహణ ఎలా...?

- 2న కొలనుభారతిలో వసంత పంచమి
- ఏర్పాట్లకు ఒక్క పైసా ఇవ్వని ప్రభుత్వం
- అమ్మవారి దర్శనానికి భారీగా తరలిరానున్న భక్తులు
- సదుపాయాలు లేక ఇబ్బంది పడే అవకాశం



కొలనుభారతి ఆలయం

ఆత్మకూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కొలనుభారతి క్షేత్రంలో ఫిబ్రవరి 2వ తేదీన అమ్మవారి జయంతిని పురస్కరించుకుని జరిగే వసంత పంచమి వేడుకలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో పలు సందర్భాల్లో వసంత పంచమి వేడుకలకు ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించేవారు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి మంజూరు కాకపోవడంతో ఆలయ ఆదాయం నుంచే ఖర్చు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలోనే ఉత్సవం ఏర్పాట్లపై ఈ నెల 21వ తేదీన నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి సమక్షంలో ఆయా శాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. అయితే నిధుల కొరత కారణంగా ఏర్పాట్లు ముందుకు సాగడం లేదని తెలుస్తోంది. వాస్తవానికి ఈ ఏడాది జరిగే వసంత పంచమి వేడుకలకు సుమారు 20 వేల మందికి పైగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని దేవదాయ శాఖ అధికారులు అంచనా వేశారు. అయితే భక్తుల సౌకర్యార్థం అక్కడ కల్పించాల్సిన కనీస ఏర్పాట్లకు సంబంధించి ప్రభుత్వం పైసా నిధులు కూడా విదిల్చలేదు. దీనికితోడు ఉత్సవంలో ఆయా శాఖల ద్వారా సదుపాయాల కల్పనకు కూడా తమ వద్ద నిధుల్లేవని సంబంధిత అధికారులు స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో చేసేదేమిలేక ఆలయ ఆదాయం నుంచే కొంత మేర ఖర్చు చేసి మొక్కుబడిగా వేడుకను ముగించేలా దేవస్థానం అధికారులు ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఈ ఖర్చును కూడా వివిధ రూపాల్లో భక్తుల నుంచి వసూళ్లు చేయాలన్న ధోరణిలో ఉన్నట్లు సమాచారం. గతంలో కూడా ఇదే తరహాలో ఉత్సవ నిర్వహణకు ఖర్చు భక్తుల నుంచి వివిధ రూపాల్లో వసూలు చేసినట్లు తెలిసింది.

ఏర్పాట్లు సజావుగా సాగేనా?

కొలనుభారతి క్షేత్రంలో ఫిబ్రవరి 2న జరిగే వసంత పంచమి వేడుకలకు దేవస్థానం అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాల్సి ఉంది. తాగు నీరు, వైద్య శిబిరాలు, క్యూలైన్లు, నీడ వసతి, దుస్తులు మార్చుకునే గదులు, మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురావాలి. వాహనాల రద్దీ దృష్ట్యా పార్కింగ్, ట్రాఫిక్ సమస్యను చక్కదిద్దే ఏర్పాట్లు చేయాలి. క్షేత్రంలో పుణ్య స్నానాలు ఆచరించే చారుఘోషిణి అధ్వాన ంగా మారింది. నీటి ప్రవాహం లేక మురికి కుంటలా దర్శనమిస్తోంది. దీంతో భక్తుల పుణ్య స్నానాలకు షవర్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఇదిలావుంటే క్షేత్రానికి వెళ్లే రహదారిలో రెండు కి.మీ. మట్టి రహదారి దారుణంగా ఉంది. గతంలో బీటీ రోడ్డు నిర్మాణం కోసం పనులు ప్రారంభించినా అటవీశాఖ అభ్యంతరాలతో నిలిచిపోయాయి. దీంతో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. వసంత పంచమి వేడుకకు ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించాల్సిన అవసరం ఉంది.



క్షేత్ర పరిధిలోని సప్త శివాలయాలు

భక్తుల నుంచి వచ్చే ఆదాయంతోనే...

కొలనుభారతి క్షేత్రంలో జరిగే వసంత పంచమి వేడుకను భక్తుల నుంచి వచ్చే ఆదాయంతోనే పూర్తి ఖర్చులను భర్తీ చేసేలా దేవస్థానం అధికారులు ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఉత్సవ నిర్వహణకు ప్రభుత్వం నుంచి పైసా నిధులు రాకపోవడంతో అమ్మవారి పేరిట బ్యాంకు ఖాతా నుంచి సుమారు రూ.4 లక్షల వరకు ఖర్చు చేసి ఆ తర్వాత ఉత్సవంలో భక్తుల ద్వారా వివిధ రూపాల్లో వచ్చే ఆదాయాన్ని తిరిగి బ్యాంకు ఖాతాలో జమ చేయాలని దేవస్థానం భావిస్తున్నారు. దాతల సహకారంతోనే అన్నదానం చేస్తున్నారు. వాస్తవానికి వసంత పంచమి వేడుకను పురస్కరించుకుని సుమారు 20 వేల మందికి పైగా భక్తులు క్షేత్రానికి తరలి వచ్చే అవకాశం ఉంది. దీంతో భక్తుల నుంచి వచ్చిన హుండీ విరాళాలు, అక్షరాభ్యాసాలు, అర్చనలు, ఆర్జిత సేవలు, దర్శన టికెట్లు, ప్రసాద విక్రయాలు, క్షేత్ర పరిధిలో వివిధ అంగళ్ల ఏర్పాటుకు అనుమతి రుసుము తదితర రూపంలో భారీగానే ఆదాయం రానున్నప్పటికీ ఈ మొత్తాన్ని ఖర్చు చేయాలంటే అనేక నిబంధనలు ఉన్నాయి. దీంతో ఉత్సవ నిర్వహణకు ప్రత్యేక నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది. అయితే వేడుక నిర్వహణకు ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులను కేటాయించకపోవడంతో ఆయా శాఖల ద్వారా భక్తులకు సదుపాయాలు కల్పించాలని దేవదాయ శాఖ అధికారులు కోరినప్పటికీ ఆయా శాఖలకు నిధుల కొరత ఉండటంతో వారు కూడా ఉత్సవ ఏర్పాట్లపై పెద్దగా దృష్టి సారించడం లేదని తెలిసింది. దీంతో వేడుకలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.





కొలనుభారతి క్షేత్రానికి చేరుకునే రహదారి దుస్థితి ఇలా



క్షేత్రంలో శుభ్రపరచని నీటి ట్యాంకులు



చారుఘోషిణి నది దుస్థితి ఇలా..?

దేవస్థానం నిధులతో ఉత్సవం నిర్వహిస్తాం

వసంత పంచమి ఉత్సవాన్ని అమ్మవారి బ్యాంకు ఖాతా సొమ్ము నుంచే ఖర్చు చేస్తున్నాం. ఉత్సవ నిర్వహణకు ప్రభుత్వం నుంచి ఇంత వరకు ఎలాంటి నిధులు మంజూరు కాకపోవడంతో కొత్తపల్లి ఎస్‌బీఐ ఖాతాల్లో అమ్మవారి పేరిట ఉన్న రూ.4 లక్షలను ఉత్సవ నిర్వహణకు ఖర్చు చేయాలని భావిస్తున్నాం. ఉత్సవం పూర్తయిన తర్వాత ఆర్జిత సేవల తరపున వచ్చే సొమ్మును తిరిగి అమ్మవారి ఖాతాకు జమ చేస్తాం. అదేవిధంగా ఆయా శాఖల ద్వారా భక్తులకు సదుపాయాలు కల్పించాలని ఇప్పటికే సంబంధిత శాఖల అధికారులను కోరాం.

- రామలింగారెడ్డి, కొలనుభారతి దేవస్థానం ఇన్‌చార్జి ఈవో

భారతీయులంతా ఒకే కుటుంబం

- టీకేఆర్ శర్మ నిస్వార్థ దేశ భక్తుడు
- మాజీ ఎంపీ టీజీ



కేవీఆర్ కళాశాలలో మాట్లాడుతున్న మాజీ మంత్రి టీజీ వెంకటేష్

కర్నూలు అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): భిన్నత్వంలో ఏకత్వంలా భారతీయులందరూ ఒకే కుటుంబమని, వారిని ఎవరూ విడదీయ లేదని మాజీ మంత్రి టీజీ వెంకటేష్ అన్నారు. గురువారం కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో గాంధీ వర్థంతి సందర్భంగా స్వాతంత్ర సమరయోధుడు టీకేఆర్ శర్మ శతజయంతి ఉత్సవ సాహితీ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కురాడి చంద్రశేఖర్, క్లస్టర్ వర్శిటీ ఉపకులపతి ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్‌లతో కలిసి గాంధీ, ప్రకాశం పంతులు, పీవీ నరసింహారావు, టీకేఆర్‌శర్మ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ ఎంతో మేధో సంపత్తి ఉన్నవారికి కూడా కులం అంటగట్టడం భావ్యం కాదన్నారు. విద్యార్థులు కులమతాలకు అతీతంగా అభివృద్ధి చెంది సమాజ హితానికి పాటు పడాలని సూచించారు. ఉపకులపతి డీవీఆర్ సాయిగోపాల్ మాట్లాడుతూ టీకేఆర్ శర్మ శతజయంతి ఉత్సవం జరుపుకోవడం ద్వారా వారి స్ఫూర్తిని ఈ తరానికి అందజేస్తున్నామని అన్నారు. కురాడి చంద్రశేఖర్ మాట్లాడుతూ మహాత్ముడు అంటే మహాశక్తి, ఒక వ్యవస్థ అన్నారు. ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్ మాట్లాడుతూ అహింస ద్వారా స్వాతంత్ర్యం సాధించిన వ్యక్తి మహాత్మాగాంధీ అని కొనియాడారు. వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మహబూబ్ బాషా, జయప్రకాష్, సంజీవరెడ్డి, టీకేఆర్ కృష్ణ మూర్తి, డాక్టర్ పార్వతీ దేవి, సుబ్బలక్ష్మి, ఎల్లమర్తి రమణయ్య పాల్గొన్నారు.

రేపు ఏపీఆర్‌ఎస్‌ఏ జిల్లా కార్యవర్గ సమావేశం

కర్నూలు కలెక్టరేట్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ప్రాంగణంలోని రెవెన్యూ భవనంలో ఏపీఆర్‌ఎస్‌ఏ జిల్లా కార్యవర్గ సమావేశం శనివారం మధ్యాహ్నం 12 గంటలకు జరగనుంది. ఈ సమావేశంలో జిల్లాలోని రెవెన్యూ ఉద్యోగుల సమస్యలపై చర్చించనున్నారు. ఈ మేరకు కలెక్టరేట్, ఆదోని, కర్నూలు, పత్తికొండ డివిజన్ సంబంధించిన రెవెన్యూ కార్యవర్గ సభ్యులు హాజరు కానున్నారు. ఇదిలా ఉండగా కలెక్టరేట్ రెవెన్యూ అసోసియేషన్‌లో అంతర్గత విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. కలెక్టరేట్ రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం చేయడంలో ప్రస్తుత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విఫలమయ్యారని కొందరు ఉద్యోగులు రాష్ట్ర, జిల్లా అసోసియేషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో శనివారం జరిగే సమావేశంలో సుదీర్ఘంగా చర్చించి కార్యవర్గంలో పలు మార్పులు చేయనున్నట్లు సమాచారం.

కానిస్టేబుల్ రాత పరీక్షలో 4,390 మందికి అర్హత

కర్నూలు క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుళ్ల అభ్యర్థులకు గత 18 రోజులుగా జరుగుతున్న దేహదారుఢ్య పరీక్షలో 4,390 మంది రాత పరీక్షకు అర్హత సాధించారు. గత డిసెంబరు నెల 28వ తేదీ నుంచి పరీక్షలు జరుగగా 10,350 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉంది. వీరిలో 6,806 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 2,242 మంది దేహదారుఢ్య పరీక్షల్లో అర్హత సాధించలేకపోయారు. 174 మంది రిజక్ట్ అయ్యారు. 3,549 మంది గైర్హాజరైనట్లు పోలీస్ శాఖ అధికారులు వెల్లడించారు.

కుంభమేళాలో నంద్యాలవాసులు

- తిరుగు ప్రయాణంలో ట్రాఫిక్ జాం
- వీడియో వైరల్‌తో ఉలికిపాటు... అందరూ సేఫ్

నంద్యాల, జనవరి 30, (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని మహాకుంభ మేళాలో జరిగిన తొక్కిసలాట ఘటన అందరినీ ఉక్కిరిబిక్కిరి చేసింది. ఇదే కుంభమేళాకు నంద్యాల జిల్లాకు చెందిన 40 మంది ప్రయాణికులు, ముగ్గురు వంట మాస్టర్లు వెళ్లారు. అయితే తిరుగు ప్రయాణంలో సదరు ట్రావెల్ బస్సు సమన్వయ్‌పార్క్ నుంచి జాన్‌పూర్ వరకు ఏర్పడిన ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కుపోయింది. ఈ విషయాన్ని సదరు బస్సులో వెళ్లిన ముగ్గురు వంట మాస్టర్లు సంపంగి పుష్పయ్య, వీరమణికంఠ, మోహన్ వీడియోను వైరల్ చేశారు. రెండు రోజులుగా ఇదే ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కుపోయి చాలా ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. దీంతో అక్కడికి వెళ్లిన వారి కుటుంబ సభ్యుల్లో కొంత ఆందోళన కలిగింది. ట్రావెల్ యజమాని మాత్రం అందరూ సేఫ్‌గా ఉన్నారని గురువారం రాత్రి బయల్దేరుతున్నట్లు ఆంధ్రజ్యోతికి వెల్లడించారు. ఇదిలా ఉండగా బస్సులోని ప్రయాణికుల్లో నంద్యాలకు చెందిన 18 మంది, హైదరాబాద్‌కు చెందిన 22మంది, ముగ్గురు వంటమాస్టర్లు ఉన్నారు.

చిచ్చర పిడుగులు

- బరిలో దిగితే పతకం పట్టాల్సిందే..
- క్రీడల్లో రాణిస్తున్న పేద విద్యార్థులు



హోరాహోరీగా జరుగుతున్న బాలుర పోటీ

సామాన్య రైతు కుటుంబానికి చెందిన క్రీడా ఆణిముత్యాలు నేడు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. ప్రపంచ స్థాయిలో భారత కీర్తి పతాకాన్ని ఎగురవేస్తూ దేశానికి బంగారు పతకాలు సాధించి పెడుతున్నారు. తల్లిదండ్రులు పొలం పనులు, చిన్నపాటి వ్యాపారాలు చేసుకుంటూ తమ పిల్లల్ని క్రీడల్లో ప్రోత్సహిస్తున్నారు. నంద్యాలలో జరుగుతున్న జాతీయ సెపక్‌తక్రా పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.



రసవత్తరంగా సాగుతున్న మణిపూర్-ఢిల్లీ జట్ల మధ్య పోరు

నంద్యాల వైద్యం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) నంద్యాలలో రెండు రోజుల నుంచి జాతీయ స్థాయి జూనియర్ చాంపియన్‌షిప్ పోటీలు స్థానిక రామకృష్ణ పీజీ కళాశాల మైదానంలో జరుగుతున్నాయి. రాష్ట్ర సెపక్‌తక్రా సంఘం ఆధ్వర్యంలో జిల్లా సంఘం నేతృత్వంలో ఐదు రోజులపాటు ఈ పోటీలు జరగనున్నాయి. జాతీయ క్రీడాకారుల ఆట కనువిందు చేస్తోంది. అలవోకగా రివర్స్ కిక్, రోలింగ్ కిక్‌లను చూసి క్రీడాభిమానులు ఆశ్చర్యపోతున్నారు. ఒక్కొక్కరు పదుల సంఖ్యలో జాతీయ స్థాయి పోటీల్లో, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని టోర్నమెంట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. బీహార్, హర్యానా, మణిపూర్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ జట్లు జాతీయ స్థాయి చాంపియన్‌షిప్‌లో ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నాయి. బాలుర, బాలికల విభాగాల్లో మణిపూర్ జట్ల ఆట తీరు క్రీడాభిమానులను ఆకట్టుకుంటున్నాయి.

పోలీస్ ఆఫీసర్ ఉద్యోగమే లక్ష్యం



2017 నుంచి ఈ ఆట ఆడుతున్నాను. 14 సార్లు రాష్ట్ర స్థాయి, 12 సార్లు జాతీయ స్థాయిలో పాల్గొన్నాను. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ మూడు సార్లు, సబ్‌జూనియర్ మూడు సార్లు, జూనియర్ మూడు సార్లు, సీనియర్ విభాగంలో మూడు సార్లు జాతీయ స్థాయిలో పాల్గొన్నాను. బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించాను. తల్లిదండ్రులు సత్యనారాయణ, దుర్గాదేవి. చిన్నవ్యాపారం చేసుకుంటూ నన్ను క్రీడల్లో ప్రోత్సహిస్తున్నారు. బీహార్, పంజాబ్‌లలో జరిగిన పోటీలు తీపి గుర్తులు. ప్రస్తుతం ఇంటర్ సెకండియర్ చదువుకుంటున్నాను. ఉన్నత విద్య అభ్యసించి స్పోర్ట్స్ కోటాలో పోలీస్ ఆఫీసర్ అవడమే లక్ష్యం.

- గోపిరెడ్డి రోహిత,,(తూర్పుగోదావరి)

ఇండియాకు ఆడాలని ఉంది



మాది వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు లక్ష్మి, చెన్నప్పలు. పొలం పనులు చేసుకుంటూ నన్ను చదివిస్తున్నారు. పనుల్లేనపుడు రాజంపేటకు వలస వెళ్లి కూలలి పనిచేసుకుంటూ నన్ను క్రీడల్లో ప్రోత్సహిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో కొన్ని టోర్నమెంట్లు ఆడలేకపోయాను. స్నేహితుల ఆర్థిక సహాయంతో నాలుగు సార్లు పోటీల్లో పాల్గొన్నాను. క్రీడపై మక్కువతో ఆడుతున్నాను. రెండు సార్లు జాతీయ స్థాయిలో పాల్గొన్నాను. జాతీయ సాయిలో బ్రాంజ్‌మెడల్ సాధించాను. ప్రస్తుతం బీబీఏలో ద్వితీయ సంవత్సరం విద్యనభ్యసిస్తున్నాను. ఐదు సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. 9వ తరగతి నుంచి సెపక్‌తక్రా ఆటలో ప్రావీణ్యం సాధించాను. దాతలు సహకరిస్తే భారతజట్టు తరఫున ఆడాలని ఉంది.

- ఎం.వీరాంజి (ఆలూరు)

ఏషియన్ గేమ్స్‌లో పతకం సాధించాలి



మాది వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు కవిత ఓంభీష్, వ్యవసాయ పనులు చేసుకుంటూనే మమ్మల్ని క్రీడల్లో ప్రోత్సహిస్తున్నారు. 14సార్లు జాతీయ చాంపియన్ షిప్, మూడు సార్లు అంతర్జాతీయ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొన్నాను. జాతీయ స్థాయిలో ఐదు గోల్డ్‌మెడల్స్ సాధించాను. అంతర్జాతీయ స్థాయిలో సౌత్ ఏషియన్ గేమ్స్‌లో బంగారు పతకం సాధించాను. అలాగే థాయ్‌లాండ్, నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ సెపక్‌తక్రా పోటీల్లో పాల్గొన్నాను. డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాను. ఏషియన్ గేమ్స్‌లో పతకం సాధించడమే లక్ష్యంగా సాధన చేస్తున్నాను.

- మోనిక, (హర్యానా)

ఆర్థిక ఇబ్బందులు బాధించాయి



మొదట సెపక్‌తక్రా ఆడేందుకు ఆర్థిక ఇబ్బందులు బాధించాయి. ప్రతిభ ఉన్నా టోర్నమెంట్‌లో ఆడలేకపోయాను. తల్లిదండ్రులు ధర్మేంద్ర ఉపాధ్యాయ, మంజుదేవి పాట్నాలో ఉంటూ క్రీడల్లో పోత్సహిస్తున్నారు. నాన్న సేల్స్‌మెన్ ఉద్యోగం చేస్తూ క్రీడాపోటీల్లో పాల్గొనేందుకు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. అన్న సెపక్‌తక్రా క్రీడ ద్వారానే స్పోర్ట్స్ కోటాలో గయలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. అంతర్జాతీయ పోటీలు, మలేషియాలో వరల్డ్‌కప్, థాయ్‌లాండ్‌లో రెండుసార్లు, నేపాల్‌లో అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్నాను. నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో బంగారు పతకం సాధించాను. ఇంటర్ పూర్తి చేశాను. ఆటకోసం ప్రత్యేక క్రీడా పాఠశాలలో చేరేందుకు ఆలోచిస్తున్నాను. ఏషియన్ గేమ్స్‌లో పతకమే లక్ష్యంగా సాధన చేస్తున్నాను.

- బాబికుమార్ (బీహార్)

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగమే లక్ష్యం



సెపక్‌తక్రా క్రీడలో 6వ తరగతి నుంచి సాధన చేస్తున్నాను. 13 సార్లు రాష్ట్ర స్థాయి, 11 సార్లు జాతీయ స్థాయి చాంపియన్‌షిప్‌లో పాల్గొన్నాను. మాది వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు మాధవరెడ్డి, మమతలు క్రీడల్లో ప్రోత్సహిస్తున్నారు. కోచ్ శ్రీనివాసులు ప్రోత్సాహంతో సెపక్‌తక్రా క్రీడలో రాణిస్తున్నాను. ఇండియా జట్టుకు ప్రాతినిధ్యం వహించి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించి తల్లిదండ్రులను పోషిస్తాను.

- మధులత (ఒంగోలు)

జాతీయ సెపక్‌తక్రా విజేతలు



బాలుర విభాగంలో విజేత మణిపూర్ జట్టు

నంద్యాల వైద్యం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి జూనియర్ సెపక్‌తక్రా చాంపియన్‌షిప్‌లో టీమ్ ఈవెంట్‌లో విజేతలను టోర్నమెంట్ ఈఫ్ రెఫరీ బాల మురుగన్ (తమిళనాడు), బ్రిడ్జి మోహన్ సాహు (ఒరిస్సా)లు ప్రకటించారు. హోరాహోరీగా జరిగిన బాలుర ఫైనల్స్ పోటీలో మణిపూర్ జట్టు బీహార్ జట్టుపై 2-0పాయింట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ పోటీలో ప్రథమ స్థానంలో మణిపూర్ జట్టు నిలవగా, ద్వితీయ స్థానాన్ని బీహార్ జట్టు కైవసం చేసుకుంది. 3, 4 స్థానాలు సంయుక్త విజేతలుగా ఉత్తరప్రదేశ్, ఢిల్లీ జట్లు దక్కించుకున్నాయి. టీమ్ ఈవెంట్ బాలికల విభాగంలో ఫైనల్స్ పోటీలో మణిపూర్, హర్యానా జట్లు తలపడ్డాయి. రసవత్తరంగా జరిగిన తుది పోరులో మణిపూర్ జట్టు హర్యానా జట్టుపై 2-0పాయింట్ల తేడాతో విజయం సాధించి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ద్వితీయ స్థానంలో హర్యానా జట్టు నిలిచింది. 3, 4స్థానాల్లో సంయుక్త విజేతలుగా కేరళ, బీహార్ జట్లు దక్కించుకున్నాయి. గురువారం ఈ టోర్నమెంట్‌లో రెగో విభాగంలో పోటీలు నిర్వహించారు. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో ఈ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సెపక్‌తక్రా సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు.

అభ్యంతరాల మధ్య ఆమోదం

● సమస్యలపై ప్రశ్నించిన కార్పొరేటర్లు ● ముగిసిన బడ్జెట్, సర్వసభ్య సమావేశం



సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు



సమావేశానికి హాజరైన కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి, కురువ మునెమ్మ తదితరులు


5వ పేజీ తరువాయి

● కూడళ్లలో ఉండే విగ్రహాలను మరిచిపోతున్నారని 50వ వార్డు కార్పొరేటర్ ఎస్‌టీ షేక్ అహ్మద్ ప్రశ్నించారు. ఎస్‌బీఐ కూడలిలో ఉండే వైఎస్ఆర్ విగ్రహాన్ని కూటమి ప్రభుత్వం వచ్చాక పూర్తిగా విస్మరించిందని అన్నారు. కుక్కల బెడద నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. వార్డులో విద్యుత్ శాఖ అధికారులు పాత స్తంభాలను మార్చడంలో అలసత్వం వహిస్తున్నారని అన్నారు. కరెంటు స్తంభాలు మార్చాలంటే డబ్బులు ఎవరు చెల్లిస్తారని కార్పొరేటర్ కమిషనర్‌ను అడిగారు. చెత్త తరలింపు వాహనాలు మరమ్మతులు గురైతే వాటిని తిరిగి తీసుకు రావడానికి కనీసం వారం రోజులు చేస్తున్నారని, దీని వల్ల ఎక్కడి చెత్త అక్కడే నిలిచిపోయి దుర్వాసన వస్తోందని అన్నారు.

● కమ్యూనిటీ హాల్స్ నుంచి ఎంత అద్దె వసూలు చేస్తున్నారని 4వ వార్డు కార్పొరేటర్ అర్షియ పర్వీన్ ప్రశ్నించారు. ప్లే గౌండ్స్‌కు సంబంధించి ఎందుకు అద్దె రావడం లేదని అన్నారు. బిల్డింగ్ లైసెన్సు ఫీజులను ఎందుకు వసూలు చేయడం లేదని, అనుమతులు లేకుండా భవనాలు నిర్మిస్తున్నారని, వాటిని క్షేత్ర స్థాయిలో ప్లానింగ్ సెక్రటరీలు అస్సలు పట్టించుకోవడం లేదని గత ఎనిమిది నెలలుగా నగరంలో శానిటేషన్ పూర్తిగా అటకెక్కింది. కేవలం సర్వసభ్య సమావేశాలు జరుగుతున్న తరుణంలో వారం రోజుల ముందర అధికారులు వార్డుల్లో పారిశుధ్య పనులను తనిఖీ చేస్తారు. ఆ తరువాత ఇటువైపు కన్నెత్తి కూడా చూడరు. త్వరలో ఆదాయ మార్గాలను అన్వేషిస్తామని కమిషనర్ సమాధానం ఇచ్చారు.



పద్మలత



పరమేష్

● 20వ వార్డులోని 142 సర్వే నెంబరులో ఎలాంటి అనుమతులు లేకుండా ఐదు అంతస్తుల భవనం నిర్మిస్తున్నారని, అది కూడా వక్ఫ్‌బోర్డు స్థలమని దానిని రక్షించాలని స్థానిక కార్పొరేటర్ నాగలక్ష్మిరెడ్డి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

● 17వ వార్డులో పార్కుల నిర్వహణ సరిగా జరగడం లేదని కార్పొరేటర్ క్రైప పద్మలతారెడ్డి అన్నారు. వార్డులో ఉండే ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం వద్ద అనవసరంగా ఫ్లెక్సీలు కట్టి విగ్రహం కనపడకుండా చేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

● ఫ్లెక్సీల విషయంలో ప్రజాప్రతినిధులు కూడా చొరవ తీసుకోవాలని కమిషనర్ సూచించారు. ఎక్కడ బడితే అక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకుండా కింది స్థాయి కార్యకర్తలు. నాయకులకు ప్రజాప్రతినిధులే చెప్పాలన్నారు.

● 20వ వార్డు, 48వ వార్డులో ఎలాంటి వీఎల్‌టీ చెల్లించకుండా, భవనాన్ని అనుమతి తీసుకోకుండా టెన్నిస్ కోర్టు ఏర్పాటు చేశారని, దీని వల్ల నగర పాలక ఆదాయానికి సుమారు రూ.40 లక్షలు నష్టం వాటిల్లుతుందని 49వ వార్డు కార్పొరేటర్ సోంపల్లి క్రిష్ణకాంత్‌రెడ్డి కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.



షేక్ అహ్మద్

● మున్సిపాలిటీ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని 41వ వార్డు కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి అన్నారు. బడ్జెట్‌లో పండుగల నిర్వహణకు రూ.44 లక్షలు ఖర్చు చేశారని చెబుతున్నారు..ఏ పండగుకు చేశారని ఆమె ప్రశ్నించారు. విష్ణు టౌన్‌షిప్‌లో రోడ్డు ఆక్రమిస్తున్నారని, ప్రతి సారి సమావేశంలో చెబుతున్న పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు పట్టించుకోవడం లేదని ఆమె పేర్కొన్నారు.



సుజాత

● నగర పాలక నూతన భవనాన్ని త్వరితగతిన పూ ర్తి చేయాలని 11వ వార్డు కార్పొరేటర్ యూనుస్‌బాషా కోరారు.

● ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా రోడ్డుని ఆక్రమించు కుని వేసుకున్న దుకాణాలను తక్షణమే తొలగించాలని, వాటి వల్ల తీవ్ర ట్రాఫిక్ అంతరాయం కలగడంతోపాటు ఆసుపత్రిలోపలికి అంబులెన్సులు వెళ్లలేని పరిస్థితి నెలకొందని 16వ వార్డు కార్పొరేటర్ విజయలక్ష్మి మేయర్ దృష్టికి తీసుకెళ్లారు.

● పందిపాడు, అశ్వర్థపురం, లక్ష్మీపురం గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, మరణ, జనన ధ్రువీకరణ పత్రాలు జారీ సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారాని కి చర్యలు తీసుకోవాలని స్థానిక కార్పొరేటర్ నారాయణ రెడ్డి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

● 13వ వార్డు నంద్యాల గేట్‌లో మున్సిపాలిటీ స్థలం ఉందని, ఆ స్థలంలో సచివాయాలు ఏర్పాటు చేస్తే అద్దె భవనాలకు అద్దె చెల్లించాల్సిన అవసరం ఉండదని కార్పొరేటర్ విజయలక్ష్మి కమిషనర్‌కు సూచించారు.

● గుత్తి పెట్రోలు బంకు వద్ద పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి సమస్య ఉంటే అక్కడికి వెళ్లా నని, పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు అక్కడికి వచ్చారని, ఈ క్రమంలో అధికారిని సమస్య పరిష్కరించ మని అడిగితే.. 'నీవెవరు నాకు కమిషనర్ ఉన్నాడు. సమాధానం చెబుతానని' చెప్పడం విడ్డూరంగా ఉందని 29వ వార్డు కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. 'స్థానిక కార్పొరేటరైనా నాకే ఈ విధంగా అధికారి సమాధానం చెబితే..నేను ప్రజాప్రతినిధినా...బ్రోకర్‌నా సమాధానం చెప్పాలి' అని అన్నారు. చిరు వ్యాపారుల వద్ద నేను డబ్బులు వసూలు చేస్తున్నానని అడిషనల్ కమిషనర్ చెప్పారు...దమ్ముంటే నిరూపిస్తే కార్పొరేటర్ పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవి.కృష్ణ, ఎస్‌ఈ రాజశేఖర్, సిటి ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఈఈ శేషసాయి, అకౌంట్స్ ఆఫీసర్ చండీప్రసాద్, ఎగ్జామినర్ సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.



విజయకుమారి

త్వరలోనే నూతన భవనాన్ని పునఃప్రారంభిస్తాం

నగర పాలక నూతన భవనాన్ని త్వరలోనే పునఃప్రారంభిస్తాం. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. ఈ విషయాన్ని రాష్ట్ర మంత్రి టీజీ భరత్ దృష్టికి తీసుకెళ్లాం. 2024 ఏప్రిల్ 1కి ముందు పనులు ప్రారంభం కానివి, 25 శాతం లోపల అయినవి నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో నగర పాలక పరిధిలో అలాంటివి మొత్తం 160 పనులు ఉన్నాయి. వాటిన్నంటినీ నిలుపుదల చేశాం. త్వరలోనే ప్రభుత్వ అనుమతితో రీ టెండరు పిలిచి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా దుకాణాల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. వాహనాల మరమ్మతులకు సంబంధించి సుమారు రూ.40 లక్షలు చెల్లించాం. త్వరలోనే మిగిలినవి కూడా చెల్లిస్తాం. సంస్కృతి పార్కులో కాంట్రాక్టర్ రుసుము ఎక్కువ వసూలు చేస్తున్నందుకు నిలిపివేశాం. త్వరలోనే పునఃప్రారంభిస్తాం. కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే బోర్డుకు దరఖాస్తు చేశాం. బోర్డు సభ్యులు వచ్చి గార్గేయపురం డంప్‌యార్డు వద్ద కుక్కల నియంత్రణ కేంద్రాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. త్వరలోనే అనుమతులు వస్తాయి.

- ఎస్.రవీంద్రబాబు, నగర పాలక కమిషనర్



సబ్‌జైలు తనిఖీ



ఖైదీలతో మాట్లాడుతున్న వెంకట శేషాద్రి

పత్తికొండ టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ పట్టణంలో గురువారం సబ్‌జైలును కర్నూలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి తనిఖీ చేశారు. గురువారం పత్తికొండకు వచ్చిన ఆయన సబ్ జైలును సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. సబ్‌జైలులో ఆర్వో, వాటర్ ప్లాంటు, మరమ్మతుల కోసం జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపాలని జైలు సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో పత్తికొండ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ లక్ష్మన్న, ప్రభుత్వ వైద్యులు వెంకటేశ్, న్యాయవాది నాగరాజు, కోర్టు సిబ్బంది రాజేంద్ర, ప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

గోస్పాడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దీబగుంట్ల గ్రామంలో ఉన్న బావిలోపడి ఓ వ్యక్తి గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. శిరివెళ్ల మండలం చెన్నూరు గ్రామానికి చెందిన పశువుల హుసేని (48) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. దీనికి తోడు అప్పులు కూడా ఎక్కువ కావడంతో మానసికంగా కుంగిపోయాడు. ఈ నెల 28న ఇంటి నుంచి వెళ్లిపోయిన హుసేని గురువారం దీబగుంట్లలో ఉన్న బావిలో శవమై కనిపించాడు. గోస్పాడు ఎస్‌ఐ వెంకట ప్రసాద్ మృతదేహాన్ని గుర్తించి బంధువులకు తెలియజేశాడు. మృతునికి భార్య రమణమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుని భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఉరి వేసుకొని..

మిడుతూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మిడుతూరు మండల పరిధి లోని వీపనగండ్ల గ్రామానికి చెందిన మంగలి జయరాముడు (45) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. కొంత కాలం నుంచి జయరాముడు అనారోగ్యంతో బాధపడుతు న్నాడు. ఈ క్రమంలోనే గురువారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య పద్మావతి ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ హరిప్రసాద్ కేసు నమోదు చేశారు.

కిడ్నీ ఇప్పిస్తామని మోసం

● నిందితుడి అరెస్టు

కర్నూలు క్రైం, జనవరి 30: (ఆంధ్రజ్యోతి): కిడ్నీ ఇప్పిస్తామని డబ్బులు తీసుకుని మోసం చేసిన కేసులో నిందితుడు బోయ నరసింహులును పోలీసులు అరెస్టు చేశారు. త్రీటౌన్ సీఐ శేషయ్య తెలిపిన వివరాల మేరకు.. సి.బెళగల్ మండలం మారందొడ్డి గ్రామానికి చెందిన రమేష్ నాయుడు తండ్రి నాగప్ప మూడేళ్ల నుంచి కిడ్నీ వ్యాధితో బాధపడుతు న్నాడు. తరచుగా డయాలసిస్ చేయించుకునే సందర్భంలో గూడూరు మండలం పొన్నకల్లు గ్రామానికి చెందిన నరసింహుడు అనే వ్యక్తి ప్రభుత్వ ఆసుపత్రిలో పరిచయమయ్యాడు. తాను అనస్థీషియా టెక్నీషియన్ అని నమ్మించాడు. తనకు పెద్ద పెద్ద డాక్టర్లు తెలుసునని, రూ.3 లక్షలు ఇస్తే కిడ్నీ దాత ద్వారా కిడ్నీ ట్రాన్స్‌పార్మేంటేషన్ చేయిస్తామని నమ్మించాడు. ఈయన మాటలు నమ్మిన రమేష్ నాయుడు 2023 నవంబరులో రూ.3 లక్షలు ఇచ్చాడు. ఆ తర్వాత కిడ్నీ ఇప్పించకుండా తప్పించుకుంటూ తిరుగుతుండటంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితున్ని అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ బాబు ప్రసాద్ తెలిపారు.



నిందితుడిని చూపుతున్న పోలీసులు

రూ.50 లక్షల భూమి కబ్జా

● ప్రభుత్వ స్థలంలో 'పులి రాజా' పాగా ● 30 సెంట్ల స్థలంలో బండలు పాతిన జనసేన నాయకుడు

ఆదోని రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాలు మారినా భూ కబ్జాల పర్వం మాత్రం కొనసాగుతూనే ఉంది. నాడు వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీ, ప్రభుత్వ, వంక, చెరువు భూములను ఆ పార్టీ నాయకులు కబ్జా చేస్తే నేడు అదే బాటలో కూటమి ప్రభుత్వానికి చెందిన జనసేన నాయకులు కబ్జాల పరంపరను కొనసాగిస్తున్నారు. ఏకంగా రూ.50 లక్షల విలువ చేసే 30 సెంట్ల ప్రభుత్వ భూమిని జనసేన నాయకుడు పులి రాజా కబ్జా చేసి బండలు నాటేశాడు. జనసేన నాయకుడు మల్లప్పకు నోట్లో నాలుకలా ఉండే ఆయన భూకబ్జాకు పాల్పడడంతో పలువురు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆదోని మండలం అలసందగుత్తిలో సర్వే నెం. 149లో 24 ఎకరాల 44 సెంట్ల కొండ పోరంబోకు భూమి ఉంది. ఇక్కడ సెంటు రూ.3 లక్షలు పైబడి పలుకుతోంది. ఇదే సర్వే నంబరులోని గ్రామ నడి బోడ్డున రాముడు దేవాలయం పక్కన దాదాపు 30 సెంట్ల ప్రభుత్వ భూమిపై జనసేన నాయకుడు పులి రాజా కన్నువేశాడు. చెట్లు తొలగించి స్థలాన్ని చదును చేసి బండలు నాటి కబ్జా చేశారు. అడ్డొచ్చిన మహిళలపై దాడి కూడా చేశారు.



అలసందగుత్తిలో జనసేన నాయకుడు కబ్జా చేసిన స్థలం

పంచాయతీ తీర్మానం, రెవెన్యూ అధికారుల అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలాలను జనసేన నాయకుడు స్థలాన్ని కబ్జా చేశాడంటూ, గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేసినా పలితం లేకుండా పోయింది.

ఫిర్యాదు చేశారు

- రమేష్, వీఆర్‌ఓ, ఆదోని

గ్రామంలో కొండ పోరంబోకులో ఉన్న ప్రభుత్వ భూమిని పులిరాజా కుటుంబ సభ్యులు కబ్జా చేసి బండలు నాటారని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని పై స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లాను.

కబ్జా స్థలాన్ని స్వాధీనం చేసుకుంటాం



అలసంద గుత్తిలో కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాన్ని తక్షణమే స్వాధీన పరుచుకుంటాం. ఆ స్థలానికి సంబంధించి ఎవ్వరికి కూడా పట్టాలు ఇవ్వలేదు. ఈ విధంగా ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.

- శివరాముడు, తహసీల్దార్, ఆదోని

రుణాల పేరుతో మోసం

● ఇద్దరు నిందితుల అరెస్టు

కర్నూలు క్రైం, జనవరి 30: (ఆంధ్రజ్యోతి): టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో దళిత శక్తి ఫౌండేషన్ పేరుతో రుణాలు ఇప్పిస్తామని మోసం చేస్తున్న ఇద్దరు నిందితులను టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు మారెన్న అలియాస్ విజయకుమార్, (సూదిరెడ్డిపల్లె, కర్నూలు), మహే జబీన్ (మహిళ, సూదిరెడ్డిపల్లె, కర్నూలు)లను అరెస్టు చేశారు. నిందితులు ఇద్దరు కర్నూలు నగరంలో పలువురిని కేంద్ర పథకాల ద్వారా వ్యాపారాలు చేసుకునేందుకు రుణాలు ఇప్పిస్తామని నమ్మించారు. వారి దగ్గర నుంచి రూ.29.70 లక్షలు నగదు వసూలు చేశారు. కొంత మంది బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ నాగరాజరావు తెలిపారు.

స్థలం కబ్జా చేసిన వారిపై కేసు నమోదు

నంద్యాల క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలోని బర్మాశాల వీధిలో ఉన్న పది సెంట్ల స్థలాన్ని ఆక్రమించుకోవడానికి వచ్చిన వారిపై కేసు నమోదు చేసినట్లు గురువారం మూడో పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కంబగిరి రాముడు తెలిపారు. గోనెగండ్ల ప్రభాకర్ స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి డోజర్లతో ఇంటిని కూలుస్తామని బెదిరించిన లింగమయ్య, సయ్యద్ అలీ, భక్తుల కిషోర్, బుర్ర నరసింహు లు, అన్నపురెడ్డి శాంసన్‌లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. తప్పుడు పత్రాలు సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి కబ్జాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మూడో పట్టణ పోలీసులు హెచ్చరించారు.

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

● పేదల జీవనోపాధికి వివిధ పథకాల అమలు ● నాబార్డు ఏజీఎం సుబ్బారెడ్డి

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 30: (ఆంధ్రజ్యోతి): నాబార్డు ద్వారా గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తామని నాబార్డు ఏజీఎం సుబ్బారెడ్డి అన్నారు. గురువారం తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. పేదల జీవనోపాధి మెరుగుపడ టానికి వివిధ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రానికి వివిధ అభివృద్ధి పథకాల కోసం ఏటా నాబార్డు రుణాలు అందిస్తున్నదని అన్నారు. ఆర్‌ఐడీఎఫ్ కింద గ్రామీణ రోడ్లకు 80 శాతం రుణాలను ఇస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం కేవలం 20 శాతం మాత్రమే భరించాల్సి ఉంటుందని అన్నారు. ఈ నిధులతో రాష్ట్రంలో 2,683 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి రూ.1,086 కోట్లు కావాలని ఆర్‌అండ్‌బీ ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. రూ.1,024 కోట్లతో 2,233 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి పంచాయతీరాజ్‌శాఖ అధికారులు నాబార్డుకు ప్రతిపాదనలు పంపారన్నారు. గత ఐదేళ్లలో పాఠశాలల్లో అదనపు గదులు, టాయిలెట్లు, తాగునీటి కోసం రూ.6,066 కోట్లు నాబార్డు ద్వారా మంజూరు చేసినట్లు తెలిపారు. ఇంకా రూ.1,133 కోట్లు రావాల్సి ఉందన్నారు. వైద్య ఆరోగ్య శాఖకు ఆసుపత్రులు, మెడికల్ కళాశాలల నిర్మాణానికి రూ.5,331 కోట్లు మంజూరు కాగా, మరో రూ. 2,198 కోట్లు అందాల్సి ఉందన్నారు. బీసీ సాంఘిక, గిరిజన, మహిళా సంక్షేమం, వ్యవసాయం, ఫిషరీస్, ఆర్‌అండ్‌బీ తదితర శాఖలకు గత ఐదేళ్లలో నాబార్డు ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.14,435 కోట్ల రుణం మంజూరు చేసినట్లు తెలిపారు.

నీటి బకెట్లో పడి బాలుడి మృతి

ఆస్పరి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అభం శుభం తెలియని బాలుడు ఆడుకునేందుకు వెళ్లి మృత్యువు ఒడికి చేరిన ఘటన మండలంలోని కైరుప్పల గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వీరేష్, పవిత్ర దంపతులకు ఒక కుతూరు, ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండో కుమారుడు చంద్రశేఖర్ (4) తల్లి ఆరు బయట బట్టలు ఉతుకుతుండగా నిండుగా ఉన్న నీటి బకెట్లో పడ్డాడు. గమనించని తల్లి ఆలస్యంగా చూడగా అప్పటికే బాలుడు విగత జీవిగా మారాడు. నీటి బకెట్లో మృతి చెందిన కుమారుడిని చుసి కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.



మృతి చెందిన బాలుడు (ఫైల్)

కూలీల సంఖ్య పెంచండి: ఎంపీడీవో



సోమయాజులపల్లెలో ఉపాధి పనులు చేస్తున్న ఎంపీడీవో

ఓర్వకల్లు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. గురువారం మండలంలోని గుమితంతండా, హుశేనాపురం, చెన్నం చెట్టిపల్లె, వెంకటాపురం, కాల్వబుగ్గ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడారు. పనులు ఏవిధంగా చేయాలో అని ఆయన చేతికి గడ్డపార పట్టుకుని పనులు చేసి చూపించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులను ప్రతి కూలీ సద్వినియోగం చేసుకోవాలన్నారు. చాలా గ్రామాల్లో కూలీలు ఎక్కువ డబ్బులు ఇస్తున్నారని పొగాకు కోసేందుకు వెళ్తున్నా రన్నారు. దీంతో ఉపాధి పనులకు కూలీలు రావడం లేదన్నారు. కార్యక్రమంలో ఏపీవో కుమారసాయినాథ్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచడం సరికాదు

కర్నూలు న్యూసిటీ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిర్మాణ, స్థిరాస్తి రంగాలు సంక్షోభంలో ఉన్న సమయంలో ఆదుకోవాల్సిన కూటమి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచడం సరికాదని వక్తలు డిమాండ్ చేశారు. గురువారం బీఏఎస్ కళ్యాణ మండపంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బిల్డర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సాయిరాంరెడ్డి, కార్యదర్శి బ్రిజేస్‌సింగ్, ప్రైవేటు నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాహుల్, రైస్ మిల్ అసోసియేషన్ నాయకుడు బ్రహ్మయ్య హాజరై ప్రసంగించారు. కార్పొరేట్ రంగానికి సహకరించినట్లు నిర్మాణ, స్థిరాస్తి రంగాలను ఆదుకోవాలన్నారు. వ్యవసాయ రంగం తరువాత ఎక్కువ మందికి ఉపాధి కల్పించేంది నిర్మాణ రంగమే అన్నారు. గత ప్రభుత్వం అద్దె విలువపై విధించే ఇంటి పన్నుల విధానాన్ని రద్దు చేసి ఆస్తి విలువపై పన్ను విధించే చట్టం చేసిందన్నారు. దీని వల్ల రిజిస్ట్రేషన్ చార్జీలు పెరిగితే ఇంటి పన్నులు కూడా పెరుగుతాయన్నారు. సమావేశంలో బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యాకోబు, నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, గోరంట్ల, జాకీర్ బాషా, మహేశ్వరరావు పాల్గొన్నారు.

చెత్త కుండీలు ఏర్పాటు చేయాలి

కర్నూలు న్యూసిటీ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని టీ, తినుబండారాలు వంటి దుకాణాల ఎదుట చెత్తకుండీలను ఏర్పా టు చేసుకోవాలని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదేశించారు. గురువారం ఆయన బంగారుపేట, కొత్తబస్టాండు, బళ్లారి చౌరస్తా, చెన్నమ్మ కూడలి ప్రాంతాలలో పారిశుధ్య పనులను పరిశీలిం చారు. అనంతరం కలెక్టరేట్‌లోని అన్న క్యాంటీన్‌ను సందర్శించారు. పలు ప్రాంతాలలో దుకాణాల వద్ద రహదారిపై చెత్తాచెదారం ఉం డటంటపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారిపై చెత్తాచెదారం ఉంటే సంబం ధిత దుకాణదారుడిదే బాధ్యత అన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్ ఉన్నారు.

సర్వేను పకడ్బందీగా చేపట్టండి: డీఎల్‌పీవో

ఓర్వకల్లు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల్లో శవమిత్ర సర్వేను పకడ్బందీగా చేపట్టాలని డీఎల్‌పీవో లక్ష్మి సూచించారు. గురువారం మండలంలోని కన్నమడకల గ్రామాన్ని ఆమె తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సచివాలయంలో చేప డుతున్న శవమిత్ర సర్వేను ఆమె పరిశీలించారు. అలాగే గ్రామంలో బోర్లను, వాటర్ ట్యాంకులను పరిశీలించారు. డీఎల్‌పీవో మాట్లాడుతూ గ్రామంలో డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలన్నారు. ఆమె వెంట ఈవోఆర్డీ సుబ్బరాయుడు, సర్పంచ్ పెద్దకాశీం, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి నాగరాజు, నాయకులు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఏపీ జేఏసీ అమరావతి కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

కర్నూలు కలెక్టరేట్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఏపీ జేఏసీ అమరావతి జిల్లా ఛైర్మన్‌గా కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీరాజు, వైస్ ఛైర్మన్‌గా మద్దిలేటిలను ఎన్నుకున్నారు. గురువా రం కలెక్టరేట్ ప్రాంగణంలోని రెవెన్యూ భవన్‌లో జిల్లా రెవెన్యూ సంఘం అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో ఏపీ జేఏసీ అమరావతి జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఏపీ జేఏసీ అమరావతి కార్యవర్గ సభ్యులు నాగరమణయ్య, నాగరాజు, రామనాయుడు, రవీంద్రారెడ్డి, శ్రీనివాసులు, సూరిబాబు, మల్లేశ్వరమ్మ పాల్గొన్నారు.

వాట్సప్ గవర్నెన్స్ సేవలు అభినందనీయం

కర్నూలు అర్బన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): వాట్సప్ గవర్నెన్స్ సేవలు అభినందనీయమని ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల నాగేంద్ర అన్నారు. గురువారం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గతంలో ప్రజల వద్దకే పాలన తెచ్చామని గొప్పలు చెప్పుకున్నా వైసీపీ నాయకులు చిన్న సమస్యను కూడా పరిష్కరించ లేకపోయారన్నారు. మంత్రి నారా లోకేశ్ యువగళం పాదయాత్ర ద్వారా అప్పట్లోనే ఈ గవర్నెస్ తీసుకురావాలనే ఆలోచనకు శ్రీకారం చుట్టారన్నారు. తొలివిడతలో దేవదాయ, విద్యుత్, ఆర్టీసీ, రెవెన్యూ, సీఎంఆర్ఎఫ్, మున్సిపాలిటీ శాఖల్లో 161 సేవలు అందిచనున్నట్లు తెలిపారు. రెండో విడత ద్వారా 360 సేవలను అందుబాటులో ఉంచుతారన్నారు. ప్రభు త్వం అందిస్తున్న ఈ సేవలను 9552300009 వాట్సప్ నెంబర్ ద్వారా ప్రజలు పొందవచ్చు అన్నారు.

స్థానికంగానే పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయాలి

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యార్థులకు స్థానికంగానే పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న డిమాండ్ చేశారు. గురువారం ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో స్థానిక ఆర్ఐవోకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి వచ్చి విద్యార్థులు పరీక్ష రాయాలనడం సిగ్గు చేటని అన్నారు. పరీక్ష ఫీజు చలానాలతో చెల్లించేవారికి కూడా జిల్లా కేంద్రంలోనే ప్రత్యేక పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని, అందులోనే వచ్చి పరీక్ష రాయాలని చెప్పడం దారుణమన్నారు. జిల్లాలు విభజన అయినా కూడా చాలా జిల్లాల్లో ఆర్ఐ వోలు కూడా లేరని, ఒక్కొక్క జిల్లా 200 కిలోమీటర్ల ప్రాంతాల్లో విస్తరించి ఉందని, కొన్ని ప్రాంతాలకు బస్సు సౌకర్యం కూడా లేదన్నారు. ఏఐఎస్ఎఫ్ నగర సహాయ కార్యదర్శి మధు, ఉపాధ్యక్షుడు ప్రశాంత్ పాల్గొన్నారు.

3న టెంకాయల వేలం

గూడూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): గూడూరు మండలం కె నాగలాపురంలో సుంకులాపరమేశ్వరి అమ్మవారి ఆలయానికి సంబంధించి టెంకాయలు, పూలు, నిమ్మకాయల వేలం ఫిబ్రవరి 3న నిర్వహిస్తున్నట్లు ఈవో బీవీ నరసయ్య తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆలయం ఆవరణలో టెంకాయలు, పూలు, నిమ్మకా యలు అమ్ముకొనే హక్కు ఏడాది కాలపరిమితికి ఫిబ్రవరి 3న 11 గంటలకు వేలాన్ని దేవదాయశాఖ అధికారుల సమక్షంలో నిర్వహిస్తామన్నారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

ప్రారంభించిన మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

కర్నూలు కల్చరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని సంకల్‌బాగ్‌లో ఉన్న హరిహర క్షేత్రంలో గురువారం శ్రీవారి 19 వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ హాజరై వేద మంత్రోచ్చారణల మధ్య ధ్వజారోహణ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆలయంలోని శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ ముప్పయ్ సంవత్సరాల క్రితం బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఈ ఆలయాన్ని నిర్మించినట్లు తెలిపారు. అప్పటి నుంచీ ఎంతో నియమ, నిష్ఠలతో తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగిన విధంగా పూజలు జరుగుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా టీజీ వెంక టేశ్‌ను నగర బ్రాహ్మణ సంఘం నాయకులు ఘనంగా సత్క రించారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, చిత్ర నిర్మాత బీవీ రెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు సీవీ దుర్గాప్రసాద్, శ్రీధర్, శ్యామసుందర్‌రావు, చల్లా నాగరాజ శర్మ, నాగులవరం రాజశేఖర్, సీఎస్ ప్రసాద్‌రావు, టీవీ రవిచంద్ర శర్మ, సుబ్రహ్మణ్యం, ఆర్యవైశ్య సంఘం నాయులు ఇల్లూరు లక్ష్మయ్య, కార్పొరేటర్ పరమేష్ పాల్గొన్నారు.

● **బ్రహ్మోత్సవాలకు తరలి వచ్చిన భక్తులు:** బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. ఆలయంలో మూల మూర్తులతోపాటు, ఉత్సవమూర్తులకు ఆలయ అర్చకులు మామి ళ్లపల్లి రాజేశ్ శర్మ, ప్రసన్న శర్మ, మహేశ్ శర్మ, గురు రాజారావులు పూజలు చేసి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పించారు. ఆలయంలో తొలిరోజున సుప్రభాత సేవ, గోపూజ, అభిషేకాలు, అర్చనలు, అలంకరణ సేవలు చేపట్టారు. అలాగే ఉదయం విఘ్నాలు తొలగిపోయి, లక్ష్మీ ప్రాప్తికి లక్ష్మీగణపతి హోమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను శేష వాహనంపై ఆసీనింపజేసి వీధుల్లో ఊరేగించారు.



హరిహర క్షేత్రంలో పూజలు చేస్తున్న టీజీ వెంకటేశ్, బీవీ రెడ్డి

గాంధీకి ఘన నివాళి

కర్నూలు అర్బన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మహాత్మగాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా పార్టీ అధ్యక్షుడు తిక్కారెడ్డి, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీ హింసా మార్గంలో కాకుండా అహింసా మార్గంలోనే దేశానికి స్వాతంత్ర్యం సాధించారన్నారు. కార్యక్ర మంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నంద్యాల నాగేంద్ర కుమార్, దాశెట్టి శ్రీనివాసులు, సోమిశెట్టి నవీన్, బొగ్గుల ప్రవీణ్, రెడ్డి పోగు బజారన్న, సత్రం రామక్రిష్ణుడు, ధరూర్ జేమ్స్, హనుమంతరావు చౌదరీ, షేక్షావలి పాల్గొన్నారు.

● కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గాంధీజీ వర్ధంతి సంద ర్భంగా ఆయన చిత్రపటానికి డీసీసీ అధ్యక్షుడు పీ మురళీకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకముందు కొండారెడ్డి బురుజు వద్ద గల పార్కులో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, దామో దరం రాధాకృష్ణ, ఓబీసీ ఛైర్మన్ సాంబశివుడు, వెంకటసుజాత, లాజరస్, మల్లేశ్వరి పాల్గొన్నారు.

కర్నూలు రూరల్: మహాత్మాగాంధీ కలలు కన్న స్వరాజ్య స్థాపనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. గురువారం గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకొని కర్నూలు మండలం పంచలింగాల గ్రామంలో ఎంపీ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులంచారు. ఈసందర్భంగా నాగరాజు మాట్లాడుతూ గాంధీజీ చూపిన మార్గంలో అందరు నడవాలని సూచించారు. కార్యక్రమంలో పంచలింగాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్: స్థానిక బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో గురువారం మహాత్మ గాంధీ వర్ధంతి సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి నాయక్, అధ్యాపకులు, మెడికల్ ఆఫీసర్ లీనారెడ్డి, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ ఎం.నారాయణరావు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గాంధీజీ సేవలను కొనియాడారు. అనంతరం కుష్టువ్యాధిపై కలెక్టర్ ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ లీనారెడ్డి, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ ఎం.నారాయణరావు మాట్లాడుతూ కుష్టు వ్యాధికి చికిత్స అన్ని పీహెచ్‌సీల్లో, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా లభిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామకృష్ణ, విజయశేఖర్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తరగతుల విలీనాన్ని ఆపేయాలి



ధర్నా చేస్తున్న విద్యార్థి యువజన సంఘాల నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం 3, 4, 5 తరగతుల విలీనాన్ని ఆపేయాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా కమిటీ కన్వీనర్ గట్టుతిమ్మప్ప, కో-కన్వీనర్ ఇస్మాయిల్, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు మాట్లాడుతూ 117 జీవోతో ప్రాథమిక విద్య పూర్తిగా నాశన మైందని, దానిని పూర్తిగా రద్దు చేస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. 117 జీవోను మరో రూపంలో మార్చి ఒక ఆవస ప్రాంతంలో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను ఆదర్శ పాఠశాలల పేరిట వేరే ఊరికి తరలించడానికి రంగం సిద్ధం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో డీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం ఏసేపు, ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి మరియానందం, డీటీఎఫ్ ఉపాధ్యక్షుడు రోశన్న, రాజసాగర్, పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సీమ అభివృద్ధి

కర్నూలు అర్బన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాయలసీమ అభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని రాయలసీమ విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ ఛైర్మన్ బీ.శ్రీరాములు అన్నారు. గురువారం అమరావతిలో సచివాలయంలో నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య నాయకత్వంలో సీఎం చంద్రబాబును మర్యాద పూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓర్వక ల్లులో లాజిస్టిక్ పార్కు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు నిరుద్యోగ, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. బెంగళూరు. కర్నూలు, హైదరాబాద్‌ను కలుపుతూ ఓర్వకల్లు ఇండ స్ట్రియల్ కారిడార్‌ని అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని కోరారు.

కలెక్టరేట్ ప్రాంగణం తనిఖీ

కర్నూలు కలెక్టరేట్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): సెక్యూరిటీ ఆడిట్‌లో భాగంగా గురువారం కలెక్టరేట్ ప్రాంగణాన్ని విజయవాడ నుంచి వచ్చిన ఇంటెలిజెన్సీ డీఎస్పీ చక్రధర్ రావు తనిఖీ చేశారు. అనంతరం డీఆర్వో కార్యాలయంలోని జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. కలెక్టరేట్‌లో పని చేసే ప్రతి ఉద్యోగి ఐడీ కార్డుతో రావాలన్నారు. కలెక్టరేట్ ప్రవేశ ద్వారం ముందు అధికా రుల కోసం వచ్చే విజిటర్లు, ఇతరులకు డిజిటల్ స్లిప్పులు అంద జేయడంతోపాటు సమయాన్ని నమోదు చేయాలన్నారు. ప్రాంగణం ప్రహరీని సోలార్ ఫినిషింగ్ చేయాలన్నారు. ఇన్‌చార్జి డీఆర్వో వెంకటేశ్వర్లు, కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, త్రీటౌన్ సీఐ శేషయ్య, అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ పాణ్యం విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా రాకేష్

కల్లూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాణ్యం నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా కల్లూరు రాకేష్ నియామకమయ్యారు. గురువారం నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వైసీపీ కర్నూలు జిల్లా కార్యదర్శి హనుమంతరెడ్డి, సాయికుమార్, గిరీష్, రంగన్న, బాలరాజు పాల్గొన్నారు.

బీసీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

ఓర్వకల్లు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాల మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలోని బీసీ, ఈబీసీ వర్గాలకు చెందిన ప్రజలు వ్యవసాయం, రవాణా, పరిశ్రమలు, ఎలక్ట్రానిక్ సర్వీసులు, చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా స్థిరపడేందుకు ప్రభుత్వం రుణాలను అందిస్తోందని తెలిపారు. ఓర్వకల్లు మండలానికి 3 కేటగిరీలలో 52 యూనిట్లకు బీసీ కార్పొరేషన్ ద్వారా 50 శాతం సబ్సిడీ, ఆయా బ్యాంకుల ద్వారా 50 శాతం రుణాలు ఇచ్చేందుకు సుమారు రూ.కోటితో యూనిట్లు మంజూరయ్యాయని చెప్పారు. అర్హులైన లబ్ధిదారులు ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 7వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రుణాలు పారదర్శకంగా పంపిణీ చేయాలి

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాలు పారదర్శకంగా పంపిణీ చేయాలని బీసీ రిజ ర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల లక్ష్మీకాంతయ్య, బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవపూజ ధనుంజయాచారి అధికారులను కోరారు. గురువారం బీసీ కార్పొరేషన్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాకీర్ హుశేన్‌ను కలిసి బీసీ రుణాలను చర్చించాలని కోరారు. కర్నూలు జిల్లాకు 1,673 యూనిట్లు, నంద్యాల జిల్లాకు 2,156 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. నాయ కులు చంద్రశేఖర్ యాదవ్, వాల్మీకి, బాలకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): బి.క్యాంపు ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఇద్రుస్ బాషా కుటుంబం ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. తల్లిదండ్రులు ఇద్రుస్‌ను చదువులు మానేయాలని చెప్పడంతో రిటైర్డు ఐజీ ఇక్బాల్ ఆర్థిక సాయం అందజేసి చదివి స్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా బి.క్యాంపు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల మైదానంలో రిటైర్డు ఐజీ ఇక్బాల్ స్థానికులతో కలిసి శ్రమదానం చేశారు.

కూలీలందరికీ పనులు కల్పించాలి

కల్లూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జాబ్‌కార్డు ఉన్న ఉపాధి కూలీలందరికీ పనులు కల్పించాలని ఎంపీడీవో జి.నాగేశాచలరెడ్డి అన్నారు. గురువారం ఆయన బొల్లవరం, బస్తిపాడు, పుసులూరు, రేమడూరు గ్రామాల్లోని సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

వైద్యం వికటించి రోగి మృతి

హాస్పిటల్ ఎదుట బంధువుల ఆందోళన

కర్నూలు హాస్పిటల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓమినీ హాస్పిటల్‌లో వైద్యం వికటించి రోగి మృతి చెందారని బంధువులు ఆరోపించారు. ఈసందర్భంగా రోగి బంధువులు హాస్పిటల్ ఎదుట ఆందోళన చేశారు. దేవనకొండ మండలం బండగట్టుకు చెందిన ఆదిలక్ష్మి(40) ఓపెన్ హార్ట్ సర్జరీ కోసం ఆరోగ్యశ్రీ కింద నగరంలోని ఓమినీ హాస్పిటల్‌లో చేరింది. వైద్యులు రోగికి గుండె ఆపరేషన్ చేసి అదనంగా రూ.70వేలు వసూలు చేశారని బంధువులు తెలిపారు. గత 15 రోజుల క్రితం ఓపెన్ హార్ట్ సర్జరీ చేసిన ప్రాంతంలో చీము పట్టడంతో రోగి ఓమినీ హాస్పిట ల్‌కు తీసుకువచ్చారు. ఇన్‌ఫెక్షన్ అయిందని, తగ్గుతుందని వైద్యు లు చెప్పి వెనక్కి పంపారు. అయితే కుట్లు వేసిన చోట ఇన్‌ఫెక్షన్ తీవ్రం కావడంతో రోగిని వారం రోజుల క్రితం మళ్లీ హాస్పిటల్‌లో చేర్పించారు. గురువారం తెల్లవారుజామున 2 గంటలకు మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. దీంతో బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. ఓపెన్ హార్ట్ సర్జరీ కోసం వచ్చిన ఆదిలక్ష్మి ప్రాణాలు కాపాడాల్సిన వైద్యులు ప్రాణాలు తీశారంటూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఓమినీ హాస్పిటల్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న మాట్లాడుతూ 40 రోజుల క్రితం ఎన్టీఆర్ వైద్య సేవ కింద రోగికి ఓపెన్ హార్ట్ సర్జరీ చేశారని, ఆరోగ్యశ్రీ కింద అడ్మిట్ అయిన రూ.70వేలు వసూలు చేశారన్నారు. సర్జరీ చేయడంలో వైద్యులు నిర్లక్ష్యం చేయడంతో కుట్లు వేసిన చోట ఇన్‌ఫెక్షన్ అయి రోగి చనిపోయిందన్నారు.



ఆందోళన చేస్తున్న బంధువులు, ఏఐవైఎఫ్ నాయకులు

కుష్టు వ్యాధిని నిర్మూలిద్దాం

కోడుమూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కుష్టు వ్యాధిని నిర్మూలిద్దామని సర్పంచ్ భాగ్యరత్న అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం కుష్టు వ్యాధి వ్యతిరేక దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గాంధీ వర్ధంతి సందర్భం గా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మదన్ శేఖర్ మాట్లాడుతూ కుష్టు వ్యాధిపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం అధికారులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాముడు, డిప్యూటీ తహసీల్దార్ రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి అజయ్ భాస్కర్, వైద్య సిబ్బంది నరసప్ప, కమాల్ సాహెబ్ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్థులకు ప్రత్యేక చికిత్స

కర్నూలు హాస్పిటల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కుష్టు వ్యాధిగ్రస్థుల కోసం ప్రత్యేక చికిత్స అందిస్తున్నట్లు జిల్లా టీబీ ఆఫీసర్ ఎల్.భాస్కర్ తెలిపారు. ప్రపంచ కుష్టు వ్యాధి నివారణ దినంను పురస్కరించుకుని నగరంలోని విశ్వభారతి నర్సింగ్ కాలేజీలో కుష్టు వ్యాధిపై అవగాహన పక్షోత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా టీబీ ఆఫీసర్ మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 13వరకు స్పర్శ కింద జిల్లా వ్యాప్తంగా అవగాహన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. . అనంతరం కళాశాల విద్యా ర్థులతో ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా న్యూక్లియస్ అధికారి డాక్టర్ జి.మల్లికార్జున రెడ్డి, లీనారెడ్డి, విశ్వభారతి నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ భవాని పాల్గొన్నారు.

కేవీఆర్‌లో కరాటే బెల్టు గ్రేడింగ్ టెస్టు

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): యూనివర్సల్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో మాస్టర్ టి.శ్రీనివాసులు సమ క్షంలో గురువారం కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో కరాటే బెల్టు గ్రేడింగ్ టెస్టు నిర్వహించారు. ఈ టెస్టులో 30 మంది విద్యార్థి నులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్ మాట్లాడుతూ మహిళలు కరాటే, ఉషూ లాంటి మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల ఆత్మరక్షణ కలుగుతుందన్నారు. అనంతరం కలర్ బెల్టులు సాధించిన విద్యార్థులకు బెల్టులను సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఫిజికల్ డైరెక్టర్స్ కే.విష్ణువం దన, పి.మౌనిక, ఎగ్జామినర్లుగా కే.కృష్ణవేణి, ఎస్.సుస్మిత, యు. లావణ్య, విద్యార్థినులు పాల్గొన్నారు.

జాతరలో ఆటల పోటీలు నిర్వహిస్తాం

కోడుమూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): చౌడేశ్వరిదేవి జాతరలో ఆటల పోటీలను నిర్వహిస్తామని కమిటీ సభ్యులు లాయర్ ప్రభా కర్ అన్నారు. చౌడేశ్వరిదేవి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజ లు నిర్వహించారు. అనంతరం ఆటల పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 5 సంవత్సరాలుగా జాతరలో కొన్ని అనివార్య కారణాల వలన ఆటల పోటీలను నిర్వహించలేక పోయామన్నారు. అమ్మవారి జాతరకు పూర్వ వైభవం తీసుకరావాలని సంకల్పంతో ఆటల పో టీలను పునఃప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఆంధ్రయ్య, టెలిఫోన్ రాముడు, క్రిష్ణయ్య, కావ నాగ రాజు, ప్రతాప్, నటరాజ్ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలకు ప్రత్యేక క్లాసులు

- ఉదయం, సాయంత్రం పది విద్యార్థులకు స్టడీ అవర్
- వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ
- వంద శాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయుల కృషి

ఓర్వకల్లు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణతే ప్రధానం కాకుండా ఎక్కువ మార్కులు సాధించడంపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు ప్రతి ప్రభుత్వ పాఠశాలలో స్టడీ అవర్స్ పేరుతో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. గతంలో కంటే ఈ సారి మరింత మెరుగైన ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారు. తరగతి గదుల్లో పాఠాలు బోధిస్తూనే వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ మార్చి 17 నుంచి జరిగే వార్షిక పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు.

829 మంది విద్యార్థులు: ఓర్వకల్లు మండలంలో 10 ఉన్నత పాఠశాలలు, కస్తూర్బాగాంధీ విద్యాలయం, ఆదర్శ, కాల్వబుగ్గ గురుకుల పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో మొత్తం 829 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. వీరిలో 473 మంది బాలురు, 356 మంది బాలికలు ఉన్నారు.

వంద రోజుల యాక్షన్ ప్లాన్: విద్యాశాఖ ఆదేశాల మేరకు వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా డిసెంబరు మొదటి వారం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులతో బోధన అందిస్తున్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా కృషి చేస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థుల కు ప్రాజెక్ట్ వర్క్, రోజువారీ టెస్టులు నిర్వహిస్తూ మెరుగైన స్థాయికి చేరేలా కృషి చేస్తున్నారు. విద్యాశాఖ అందజేసిన స్టడీ మెటీరియల్ ఆధారంగా విద్యార్థులకు వారానికి ఒకసారి గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. గత ఏడాది మండలంలో పదో తరగతి విద్యార్థులు 70 శాతం ఉత్తీర్ణత సాధించగా ఈ సంవత్సరం ఉత్తీర్ణత శాతాన్ని మరింత పెంచేందుకు కృషి చేస్తున్నారు.



స్టడీ అవర్‌లో చదువుకుంటున్న జడ్పీ హైస్కూల్ విద్యార్థినులు

సందేహాలను నివృత్తి చేస్తున్నారు



ఉదయాన్నే బడికి రావడంతో ఉపా ధ్యాయులు చెప్పిన పాఠాలు చక్కగా గుర్తుంటున్నాయి. తరగతి గదుల్లో నేర్చుకున్న పాఠాల్లో సందేహాలుంటే ప్రత్యేక తరగతుల్లో సబ్జెక్టుల వారీగా నివృత్తి చేసుకుంటున్నాం. స్టడీ అవర్స్ మాకెంతగానో ఉపయోగపడు తున్నాయి.

- సునీత, జడ్పీ హైస్కూల్, ఓర్వకల్లు

ట్రిపుల్ ఐటీలో సీటు సాధిస్తా



పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడమే నా లక్ష్యం. ఇందుకు స్టడీ అవర్స్‌ను సద్వినియోగం చేసుకుంటున్నా.

- మహేష్, జడ్పీ హైస్కూల్, ఓర్వకల్లు

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



మండలంలో 829 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రత్యేక తరగతులు ప్రారంభించాం. పాఠశాలల వారీగా ఇప్పటికే టైం టేబుల్ ఇచ్చాం. అందుకు అనుగుణంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాం. ఈ ఏడాది వంద శాతం ఫలితాలు సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం.

- ఓంకార్ యాదవ్, ఎంఈవో, ఓర్వకల్లు

15 టన్నుల రేషన్ బియ్యం సీజ్


పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం వాహనం

ఆదోని, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఓ ఐచర్ వాహనంలో తరలిస్తున్న 15 టన్నుల ప్రజా పంపిణీ(రేషన్) బియ్యంను పోలీసులు సీజ్ చేశారు. ఈ కేసులో ఇద్దరిని అదుపులో తీసుకుని విచారిస్తున్నారు. అనంతపురం జిల్లా గుంతకల్లు నుంచి ఆదోని మీదుగా కర్ణాటక రాష్ట్రానికి ఏపీ 21 టీహెచ్ 9073 నెంబర్ గల లారీలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారని గురువారం విజిలెన్స్ అధికారులకు సమాచారం అందింది. వెంటనే అధికారులు తాలూకా సీఐ నల్లప్పకు సమాచారం ఇచ్చారు. ఇన్ఛీ ఎస్ఐ నాగేంద్రను ధనాపురం గ్రామం దగ్గర రేషన్ బియ్యం లారీ కోసం వేచి ఉన్నారు. ఈలోగా లారీ రావడంతో లారీని ఆపేందుకు ఎస్ఐ ప్రయత్నించాడు. డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వేగంగా వెళ్లిపోయాడు. సమాచారం అందుకున్న సీఐ నల్లప్ప ఆదోనిలోని లక్ష్మమ్మ అవ్వ ఆర్చ్ దగ్గర వాహనాన్ని అడ్డుకున్నారు. గుంతకల్లు నుంచి కర్ణాటకకు తరలిస్తున్నట్లు డ్రైవర్ నాగరాజు, మరో డ్రైవర్ మల్లికార్జునలు తెలిపారు. లారీని సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు సీఐ తెలిపారు.

మద్యం పట్టివేత

దేవనకొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పి.కోటకొండ- కప్పట్రాళ్ళ మార్గమధ్యంలో అక్రమ మద్యం తరలిస్తున్న వాహనాన్ని దేవనకొండ పోలీసులు పట్టుకున్నారు. సీఐ వంశీనాథ్ తెలిపిన వివరాలివీ.. పి.కోట కొండ నుంచి కప్పట్రాళ్ల మట్టి రోడ్డు మార్గంలో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం 49 బాక్సులు (ఒకో బాక్సులో 96 బాటిళ్లు) పట్టుకున్నారు. అక్రమమద్యం తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు వెంబండించగా, వాహనాన్ని వదిలేసి డ్రైవర్ పారిపోవడంతో, మద్యాన్ని స్వాధీనం చేసుకొని, వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

రేపటి నుంచి సౌత్ ఇండియా టీ-20 క్రికెట్ టోర్నమెంట్

పత్తికొండ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కేఈ మాదన్న స్మారక క్రికెట్ టోర్నమెంట్ పేరిట పత్తికొండలో ఫిబ్రవరి 1 నుంచి 18వరకు జరగనున్న సౌత్ఇండియా టీ-20 క్రికెట్‌టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు నిర్వాహక కమిటీ తెలిపింది. శాప్‌చైర్మన్ రవినాయుడుతోపాటు జిల్లా మంత్రుల, వివిధశాఖల ఉన్నతాధికారులు హాజరుకానున్న ఈ పోటీలను ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ప్రారంభించనున్నారు.

చింతముని స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

ఆదోని అగ్రికల్చర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంగరడోన గ్రామంలో వెలసిన చింతల ముని, నల్లారెడ్డిస్వామి 35వ ఆరాధన సందర్భంగా ఆలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే విరుపాక్షి గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వాగతం పలికారు. స్వామివారి ఆరాధనలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారాం రెడ్డి, సర్పంచ్ శంకరమ్మ, వెంకప్ప, రాజన్న పాల్గొన్నారు.

'ప్రజలను మోసగించిన ప్రభుత్వం'


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

ఆదోని అగ్రికల్చర్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): అమలు కాని హామీలను గుప్పించి కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహిం చారు. వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ అంటూ హామీ ఇచ్చి ఓట్లు దండుకొని నేడు అమలు చేయడంలో మాట తప్పారన్నారు. ఏ ఒక్క హామీని అమలు చేయకుండా తమ గత వైసీపీ ప్రభుత్వం పైనే నిందలు వేయడం దారుణమన్నారు. సమావేశంలో పట్టణ గౌరవ అధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి, వైస్ చైర్మన్ నరసింహులు, మునిసిపల్ మాజీ చైర్మన్ దేవదాస్ పాల్గొన్నారు.

'వీరశైవులను ఓబీసీలో చేర్చాలి'

ఆదోని టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వీరశైవ లింగాయత్‌లను ఓబీసీలో చేర్చాలని ఎమ్మెల్యే డా పార్థసారథి జాతీయ ఓబీసీ కమీషన్ (ఢిల్లీ) సభ్యులు భువన్ భూషణ్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వడం అభినందనీయమని బీజేపీ ఓబీసీ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు మలేకార్ శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ, అనేక రంగాలలో వెనుకబడి ఉన్న వీర శైవులు తమను ఓబీసీలుగా గుర్తించాలని చాలా కాలంగా పోరాడుతూ ఉన్నారని అన్నారు.

ఆర్యవైశ్యుల హర్షం

మద్దికెర, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వాసవి కన్యకాపరమేశ్వరి అగ్నిప్రవేశం దినాన్ని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ప్రకటించడపట్ల మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ముత్యాల రాజశేఖర్‌శెట్టి, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సుంకు రవీంద్ర, మెడికల్ వీరేష్ కృతజ్ఞతలు తెలిపారు. గురువారం స్థానిక నగరేశ్వరస్వామి దేవాల యంలో విలేకరులతో మాట్లాడుతూ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్యులు కన్యకాపరమేశ్వరి అగ్నిప్రవేశ మహోత్సవాన్ని శుక్రవారం జరుపుకుంటారన్నారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు ముత్తా కాశీవిశ్వనాథ్ శెట్టి, మెడికల్ సంజునాథ్, మెడికల్ సుంకురాజు ఉన్నారు.

రైలు వేళల్లో మార్పు

మద్దికెర, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గుంతకల్లు నుంచి మద్దికెర మీదుగా కర్నూలు బోధన్ వెళ్లే 57411 అనే నెంబరుగల రైలు ప్రతి సోమవారం మద్దికెర నుంచి ఉదయం ఉదయం 9 గంటలకు వెళ్తుందని, మిగతా ఆరు రోజులు యథావిధిగా ఉదయం 6 గంటలకే మద్దికెర రైల్వేస్టేషన్‌లో బయలుదేరుతుందని రైల్వే అధికారులు తెలిపారు అలాగే గుంతకల్లు నుంచి మద్దికెర మీదుగా డోన్‌కు వెళ్లే 77203 నెంబరు గల రైలు మధ్యాహ్నం 11.30 గంటలకు మద్దికెర స్టేషన్ నుంచి బయలు దేరుతుందని తెలిపారు.

వృద్ధుడి మృతి

దేవనకొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వంట పనికి వెళ్లి నేలతలమర్రికి చెందిన కుసూరు తిక్కన్న (63) గుండెపోటుతో మృతి చెందాడు. ఈ ఘటన గురువారం జరిగింది. గుండ్లకొండలో జరుగుతున్న వేడుకలో వంట చేసేందుకు గ్రామస్తులతో కలసి తిక్కన్న వెళ్లాడు. పనులు చేస్తుండగా ఆయన ఉన్నఫలంగా గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. దేవనకొండ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. తిక్కన్నకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఉత్తమ బీఎల్‌వోకు సన్మానం

వెల్దుర్తి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): లక్ష్మీనగరం గ్రామ రెవెన్యూ అధికారిగా విధులు నిర్వహిస్తున్న క్రిష్ణమూర్తి ఇటీవల విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర చీఫ్ సెక్రటరీ విజయానంద్ నుంచి రాష్ట్రస్థాయి ఉత్తమ బీఎల్‌ఓ అవార్డు, ప్రశంసా పత్రం అందుకున్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ చంద్రశేఖరవర్మ పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

గాంధీకి ఘన నివాళి


మద్దికెరలో..



ఆదోనిలో నివాళి అర్పిస్తున్న ఆవోపా సభ్యులు

ఆదోని టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ వర్ధంతిని గురువారం పట్టణంలో పలువురు జరుపుకొన్నారు. ఆవోపా ఆధ్వర్యంలో మున్సిపల్ పార్కులోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రులలోని రోగులకు పండ్లు, బిస్కెట్లు, పాలు పంపిణీ చేసారు. అధ్యక్ష, కార్యదర్శులు వంకదారు శ్రీనాథ్ గుప్తా, రఘు, ఉపాధ్యక్షులు ప్రతాప్, ఈరన్న శెట్టి మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులు వంకదారు మమతశ్రీ, శ్రీదేవి పాల్గొన్నారు.

మద్దికెర: గ్రామంలోని ప్రధాన బస్టాండు వద్దగల మహాత్మా గాంధీ విగ్రహానికి పంచాయతీ సలహాదారులు బండారు ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండారు ఆంజనేయులు మాట్లాడుతూ శాంతియుతంగా భారతదేశ స్వాతంత్రం కోసం పోరాడి ప్రాణాలు అర్పించిన మహాత్మాగాంధీ మహనీయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది విజయ్, ప్రదీప్, రామాంజనేయులు ఉన్నారు.

'సర్వే పకడ్బందీగా చేపట్టాలి'

మద్దికెర, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధిని సమూలంగా నిర్మూలించాలనే ఉద్దేశంతో ప్రతి ఆరు నెలలకొకసారి చేపడుతున్న సర్వేను సమగ్రంగా చేయాలని ప్రభుత్వ వైద్యాధికారులు రాగిణి, శ్రీలక్ష్మి అన్నారు. గురువారం కుష్ఠు వ్యాధిపై ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు ఆశా కార్యకర్తల ద్వారా క్షేత్ర స్థాయిలో ఇంటింటికి వెళ్లి ప్రజలకు కుష్ఠుపై అవగాహన కల్పిస్తామన్నారు. సీహెచ్‌వో నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్ బాషా, లెప్రసీ నోడల్ అధికారి కృష్ణమ్మ, హెల్త్ సిబ్బంది మంజుల, జ్యోతిబాయి తదితరులు ఉన్నారు.

ఆదోని రూరల్: కుష్ఠు రోగులపై వివక్ష చూపరాదని డిప్యూటీ పారా మెడికల్ అధికారి సీతారాముడు తెలిపారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

'రైతుల సౌకర్యార్థమే కూరగాయల మార్కెట్'

మద్దికెర, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలు దళారులపాలు కాకుండా మార్కెట్‌కు తరలించి అమ్ముకోవచ్చని, ఇందు కోసమే కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేశామని జిల్లా ఉద్యాన శాఖ అధికారి రామాంజనేయులు అన్నారు. గురువారం మద్దికెరలోని నాబార్డు నిధుల కింద నిర్మించిన కూరగాయల మార్కెట్‌ను పరిశీలించి వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కొత్తగా నాబార్డు ద్వారా ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్ స్థలం, నిర్మాణం, నిధులు నిర్వహణ గురించి అధికారులను అడిగి తెలుసుకున్నామన్నారు. దేవనకొండలో నాబార్డు కూరగాయల మార్కెట్ నిర్మించదలచి పరిశీలనకు వచ్చామని తెలిపారు. పత్తికొండ ఉద్యాన శాఖ అధికారి దస్తగిరి, వీహెచ్ఏ కవిత ఉన్నారు.

'చర్యలు తీసుకోవాలి'

ఆదోని అగ్రికల్చర్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థులను తమ బస్సుల్లో పరిమితికి మించి ఎక్కించుకొని వెళ్తున్నాయని, ఇలాంటి వాహనాలను గుర్తించి సీజ్ చేయాలని ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షుడు బసాపురం లింగప్ప, ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్, ట్రెజరర్ శేఖర్ కోరారు. గురువారం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శిశిర దీప్తిని కలిసి వారు వినతిపత్రం అందజేశారు.

'తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు'


అధికారులతో మాట్లాడుతన్న జడ్పీ సీఈవో

హాలహర్వి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): వచ్చే వేసవిలో జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారించేందుకు ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నామని జడ్పీ సీఈవో నాసరరెడ్డి అన్నారు. గురువారం బాపురం జలాశయాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో జలాశయాలన్నీ నీటితో నింపామని అన్నారు. ఎల్ఎల్‌సీ నీరు ఏప్రిల్ 15 వరకు సాగునీరు కొనసాగించడం వల్ల తాగునీటికి ఇబ్బందులు ఉండవన్నారు. జలాశయాలకు కావల్సిన నిధులు సకాలంలో విడుదల చేస్తామని, కాంట్రాక్టరులు తాగునీటి పథకాల పట్ల నిర్లక్ష్యం వీడి గ్రామాలకు తాగునీరు అందేలా చూడలని లేకపోతే కాంట్రాక్టరులు బిల్లులు చెల్లించకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆస్పరి: ఎంపీడీవో కార్యాలయాన్ని జెడ్పీ సీఈవో నాసారారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎంపీడీవో గీతవాణిని అడిగి తెలుసుకున్నారు.

'జీవితాన్ని నాశనం చేసుకోవద్దు'

ఆదోని అగ్రికల్చర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ విద్యార్థులు వ్యసనాలకు బానిసలై తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ సూర్య మోహన్ రావు అన్నారు. గురువారం ఆయన పట్టణంలోని ఎస్సీ బాలుర నెంబర్-1 హాస్టలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఎంతో మంది వచ్చి హాస్టల్లో ఉంటూ చదువుకొని ఉన్నతమైన స్థానంలో ఉన్నారని గుర్తు చేశారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని తమ తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని సూచించారు. ఎస్‌డబ్ల్యూవో బాబు, హాస్టల్ వార్డెనులు సిద్ధప్ప, నాగమద్దయ్య పాల్గొన్నారు.

వైన్ షాపులో 50 శాతం రాయితీ

ఆలూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆలూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గీత కులాల సంక్షేమం కోసం వైన్ షాపులలో 50 శాతం రాయితీని ప్రకటించిందని సీఐ లలిత దేవి గురువారం తెలిపారు. చిప్పగిరి మండలానికి-1 ఆస్పరి మండలానికి-1 చొప్పున వైన్ షాపులను కేటాయించినట్లు తెలిపారు. షాపుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. తహశీల్దార్ నుంచి జారీ చేసిన ఈడిగ కుల ధ్రువీకరణ పత్రాన్ని కూడా సమర్పించాలన్నారు.

'వారి పేర్లు తొలగించాలి'


డీజీపీ ద్వారకా తిరుమలరావుకు వినతి పత్రం ఇస్తున్న క్రాంతి నాయుడు

పత్తికొండ టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లుగా ఎలాంటి నేరాలకు పాల్పడనివారిని, 60 ఏళ్లపైబడిన వారిని రౌడీషీట్ నుంచి తొలగించాని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి క్రాంతి నాయుడు డీజీపీని కోరారు. గురువారం అమరావతిలో డీజీపీ ద్వారకా తిరుమల రావును క్రాంతి నాయుడు కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా క్రాంతి నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధికంగా రాయలసీమలోనే అక్రమ రౌడీషీట్స్ వల్ల ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారన్నారు.

'అద్దెలు తగ్గించాలి'

ఆలూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆలూరు పట్టణంలోని సంత మార్కెట్‌లో ఉన్న షాపులకు 30శాతం అద్దె తగ్గించాలని కోరుతూ గురువారం ఆలూరు గ్రామ పంచాయతీ ఈవో ప్రభాకర్ రావును కలిసి వ్యాపారులు వినతిపత్రం అందించారు. షాపులు ఉన్న చోట వ్యాపార లావాదేవీలు లేవని, అందువల్ల అద్దె తగ్గించాలని కోరారు. బస్టాండ్‌లో ఉన్న కూరగాయలు, పండ్లు, పూల వ్యాపారాలు, చికెన్, మటన్ దుకాణాలు కూడా సంత మార్కెట్‌లోకి తరలిస్తే వ్యాపారాలు జరుగుతాయన్నారు.

'బటన్ నొక్కితే సేవలు'

తుగ్గలి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఒక్క వాట్సప్ బటన్ నొక్కితే సేవలన్నీ అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం హర్షించదగ్గ విషయమని టీడీపీ తాలుకా తెలుగు రైతు సంఘం ఉపాధ్యక్షుడు బాలన్న, విద్యాకమిటీ చైర్మన్ మిద్దె రవికుమార్ యాదవ్ అన్నారు. గురువారం మండలంలోని జొన్నగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నాడు యువగళం పాదయాత్రలో ఇచ్చిన వాగ్దానం మేరకు ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఒక్క బటన్ నొక్కితే సర్టిఫికెట్లు, బిల్లులు చెల్లింపు జరిగేలా వాట్సాప్ గవర్నెన్స్ అందుబాటులోకి తీసుకురావడం హర్షించదగ్గ విషయమని అన్నారు.

'రుణాలు రెన్యువల్ చేసుకోవాలి'

తుగ్గలి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సొసైటీల్లో తీసుకున్న రుణాలను రెన్యువల్ చేసుకోవాలని మారెళ్ల అశోక సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి చైర్మన్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని పెండేకల్ ఆర్ఎస్ సొసైటీని ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీల్లో తీసుకున్న రైతునేస్తం, రైతుమిత్ర, క్రాప్ లోన్స్‌ను తీసుకున్న రైతులు సకాలంలో వడ్డీ చెల్లించి అప్పును రెన్యువల్ చేసుకోవాలన్నారు. మారెళ్ల సొసైటీ సీఈవో మనోహర్ నాయుడు, సిబ్బంది మధు, రైతులు ఉన్నారు.

ఎస్ఐకి సత్కారం

పత్తికొండ టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ పోలీస్ స్టేషన్‌లో రెండు సంవత్సరాలకు పైగా ఎస్ఐగా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న వెంకటేశ్వర్లును గురువారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో అర్బన్ సీఐ జయన్న, రూరల్ సీఐ పులిశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు బదిలీపై వెళ్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లుకు శాలువ, పూలమాలలు వేసి సత్కరించారు. ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి బదిలీ సర్వసాధారణమని, అయితే పని చేసిన చోట తోటి సిబ్బంది, ప్రజల నుంచి మన్ననలు పొందేలా పని చేస్తే ఆత్మసంతృప్తి ఇస్తుందన్నారు. సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహేబ్, మాజీ సర్పంచ్ సోమశేఖర్, మైత్రి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు రామ్మోహన్ పాల్గొన్నారు.

'రెగ్యులర్ ఆర్ఐని నియమించాలి'

వెల్దుర్తి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండలంలో రెగ్యులర్ ఆర్ఐని నియమించాలని సీపీఐ మండల కార్యదర్శి కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ కార్యాలయంలో కృష్ణ మాట్లాడుతూ వీఆర్వోను ఇన్‌చార్జిగా నియమించారని, సమస్యల పరిష్కారం కోసం గ్రామీణ ప్రజలు కార్యాలయానికి వస్తే అదనపు బాధ్యతలతో ఆర్ఐ అందుబాటులో ఉండడం లేదన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారన్నారు.

'రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు'


సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదోని డివిజన్ స్థాయి రోడ్డు భద్రతపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గరిష్ఠ వేగపరిమితిని అమలు చేయాలని, అధిక వేగంతో ప్రయాణించే వాహనాలను గుర్తించి జరిమానాలు విధించాలన్నారు. ప్రమాదకరమైన మలుపులు, స్కూల్ జోన్‌లు, రోడ్డు పనులు జరుగుతున్న ప్రాంతాలలో హెచ్చరికల బోర్డులు, సూచికలు ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు క్వాలిటీని మెరుగుపరుస్తూ ఎప్పటికప్పుడు గుంతలను సరిచేయాలని చెప్పారు. డీఎస్పీలు హేమలత, ఆళూర్లలో నాగేంద్ర, మోటర్ వెహికల్ ఇనెస్పెక్టర్ శిశిర దీప్తి, ఉపేంద్ర, ఆర్అండ్‌బీ డిప్యూటీ ఇంజనీర్ వెంకటేశ్వరులు, మున్సిపల్ కమిషనర్ కృష్ణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి పాల్గొన్నారు.

'ప్రాజెక్టుల నిర్మాణానికి సర్వే చేయాలి'

ఆదోని అగ్రికల్చర్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అత్యంత వెనుకబడిన జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో ఉన్న రెండు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి సర్వే పనులు చేపట్టాలని తెలుగు రైతు సంఘం జిల్లా అధికార ప్రతినిధి సాయిబాబు కోరారు. గురువారం కర్నూలు జల వనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ ఖాదర్‌బాషాను కలిసి విన్నవించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టులపై సర్వే చేయాలని ఆదేశాలు జారీ చేసినా జల వనరుల శాఖ అధికారులు పట్టించుకోలేదన్నారు. సాగునీటి వసతిని అంచనా వేస్తూ డీపీఆర్ తయారు చేయాలని సీఎం ఆదేశించినట్లు గుర్తు చేశారు. వలసల నివారణకు వ్యవసాయ అభివృద్ధికి సాగునీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణానికి అనేక సౌకర్యాలు ఉన్నా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు.

'అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు'

తుగ్గలి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని జొన్నగిరి ఎస్ఐ జయశేఖర్‌గౌడు అన్నారు. గురువారం జొన్నగిరి, తదితర గ్రామాల్లో ఆయన ప్రజలతో మాట్లాడుతూ గ్రామాల్లో అల్లర్లకు దూరంగా ఉండాలని అన్నారు. అక్రమ మద్యం, పేకాట, మట్కా వంటి కార్యకలా పాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే


చంద్రబాబును కలిసిన కేఈ శ్యాంబాబు

పత్తికొండ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుతో పాటు పత్తికొండ నియోజకవర్గనాయకులు గురువారం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి మాట్లాడారు. తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తిని లోక్‌నాథ్ తమ గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు ఉన్నాయని అన్నారు. పందికోన రిజర్వాయర్ నుండి కొత్తగా మంచినీటి పథకాన్ని ఏర్పాటుచేస్తే చిన్నహుల్తి, పెద్దహుల్తి, జూటూరు. అటికెల గుండు, దేవనబండ, నలకదొడ్డి గ్రామాలకు తాగునీరు అందుతుందని అన్నారు. ఈ పథకం ఏర్పాటుకు రూ.10కోట్ల నిధులు అవసరం అన్నారు. ఈ వివరాలతో ముఖ్యమంత్రికి వినతిపత్రాన్ని అందించారు. తుగ్గలి నాగేంద్ర, వెల్దుర్తి సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఆలయంలో జీర్ణోద్ధరణ పూజలు


హోమంలో పాల్గొన్న భక్తులు

దేవనకొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గద్దెరాళ్ళ మారెమ్మ దేవాలయంలో గురువారం ఆలయ అధికారులు గ్రామస్తులు జీర్ణోద్ధరణ పూజలు చేశారు. నూతన గర్భగుడిలో అమ్మవారి విగ్రహ పున: ప్రతిష్ఠ నేపథ్యంలో ఆలయం అవరణలో హోమాలు చేశారు. గ్రామంలో అమ్మవారి పున: ప్రతిష్ఠతో పాటు, అంజనేయస్వామి దేవాలయంలో ధ్వజ స్తంభం ప్రతిష్ఠ, ఉరువాకిలి ప్రారంభోత్సవం చేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

బిల్లులు చెల్లిస్తాం: డీఈ

తుగ్గలి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సర్వశిక్ష అభియాన్ కింద చేపట్టిన పనులన్నింటికీ బిల్లులు చెల్లిస్తామని సర్వశిక్ష అభియాన్ డీఈ శ్రీనివాసులు అన్నారు. గురువారం మండలంలోని జొన్నగిరి, తుగ్గలి, తదితర గ్రామాల్లో నిర్మాణ దశలో ఉన్న పాఠశాలల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పనులు వేగవంతం చేసి నిర్మాణాలు పూర్తి చేస్తే వాటికి బిల్లులన్నీ చెల్లిస్తామన్నారు.

'అప్రమత్తంగా ఉండాలి'


పోస్టరును విడుదల చేస్తున్న అధికారులు

తుగ్గలి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పశువులకు వచ్చే అనారోగ్యాల పట్ల జాగ్రత్తగా ఉండాలని పశువైద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండల పరిధిలోని రాంపల్లిలో పశువైద్యశిబిరం నిర్వహించి పశువులకు వైద్యచికిత్సలు చేశారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వైద్యసేవలపై పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు కృత్రిమ గర్భధారణ చేసిన చుడి పరీక్షలు నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు పశుసంవర్ధక సహాయకులు రవితేజ తదితరులు ఉన్నారు.

గోనె సంచులు వచ్చాయి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మద్దికెర, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి ప్రభుత్వం కందులు కొనుగోలు చేయడానికి అవసరమయ్యే గోనెసంచులు వచ్చాయి. గురువారం ఆంధ్రజ్యోతిలో అచ్చయిన వ్యవసాయం జూదం.. మద్దికెరలో గోనెసంచులు లేక నిలిచిపోయిన కంది కొనుగోలు అనే వార్తకు స్పందించిన మార్క్‌ఫెడ్ అధికారులు గురువారం రైతు సేవా కేంద్రానికి గోనెసంచులు సరఫరా చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ అధికారి రవి, మార్క్‌ఫెడ్ ఇన్‌చార్జి శశిధర్ మాట్లాడుతూ గోనెసంచులు నిల్వ ఉన్నాయని అన్నారు

తీర్మానం లేకుండానే షాపింగ్ కాంప్లెక్స్ వేలం

- సమాచారం ఇవ్వకుండా వేలం ఎలా వేశారు ?
- అంగీకరించబోమంటున్న వార్డు సభ్యులు
- నేడు గ్రామ సంచాయతీ సర్వసభ్య సమావేశం

ఆలూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆలూరు మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో సంత మార్కెట్‌లో ఉన్న 27 దుకాణాలకు పంచాయతీ తీర్మానం లేకుండానే అధికారులు ఎలా వేలం పాటలు నిర్వహించారని వార్డ్ సభ్యులు మండిపడుతున్నారు. ఇందు కోసం తీర్మానం చేయాలని అధికారులు తమపై ఒత్తిడి చేస్తున్నారని వార్డు సభ్యుడు గౌడప్ప అన్నారు. ఇందుకోసం గతంలో రెండు సార్లు సమావేశం ఏర్పాటుచేసినా వార్డ్ సభ్యులు హాజరు కాలేదన్నారు. మూడోసారి శుక్రవారం సర్వ సభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో ప్రధాన అంశాల కింద షాపింగ్ కాంప్లెక్స్ వేలం పాటలకు తీర్మానాలు, అక్కడ విద్యుత్ ఇతర పనుల కోసం 15వ ఆర్థిక సంఘం నిధులు ఖర్చు చేసిన విషయాలపై తీర్మానాలు చేయడానికి తగినట్లు పొందుపరచారు. వ్యాపారులు చెల్లించిన డిపాజిటు ఏమైనట్లు అని ప్రశ్నించారు. ఆ డబ్బులు సంత మార్కెట్‌లో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ అభివృద్ధికి ఖర్చు పెట్టివుంటే ఇప్పుడున్న 15వ ఆర్థిక సంఘం నిధులు ఇతర పనులకు ఉపయోగపడేవని సభ్యుల వాదన. సభ్యుల తీర్మానం చేస్తేనే షాపింగ్ కాంప్లెక్స్ వేలం పాటలకు ఆమోదం కులుగుతుంది. అంతవరకు అద్దెలు ఎలా తీసుకుంటారని ప్రశ్నిస్తున్నారు. శుక్రవారం జరిగే సమావేశంకు వార్డు సభ్యులు హాజరు అవుతారా లేదా మూడోసారి వాయిదా పడుతాయా? చూడాలి.

తాగునీరు వృథా


వృథా అవుతున్న తాగునీరు

ఆదోని రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆదోని మండలం ఇస్వీ గ్రామానికెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న తాగునీటి పైపులైన్ పగిలిపోవడంతో నీరు వృథా అవుతోంది. గ్రామాల్లో ప్రజలకు తాగునీరు సక్రమంగా అందడం లేదని, కానీ ఇలా వృథాగా నీరు పోతున్నా అధికారుల ఎందుకు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి


గజ వాహనాన్ని లాగుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి

మంత్రాలయం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామిని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి కుటుంబసమేతంగా గురువారం రాత్రి దర్శించుకున్నారు. మహాముఖ ద్వారం వద్ద ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంటేష్ జోషి, సురేష్ కోణాపూర్, ఐపీ నరసింహమూర్తి ఆయనకు స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం రజిత గజ వాహనాన్ని లాగి మొక్కలు తీర్చుకున్నారు. మఠం పండితులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట సూపరింటెండెంట్ అనంతపురాణిక్, ఎస్ఐ శివాంజల్, జయతీర్థ ఆచార్, రంగస్వామి పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

గోనెగండ్ల, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సబ్సిడీ రుణాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో మణిమంజరి కోరారు. గురువారం ఆమె మాట్లాడుతూ గోనెగండ్ల మండలంలోని బీసీ, ఈబీసీ, కాపు,(కాపు, బలిజ, తెలగ, ఒంటరి) కులాలకు చెందిన లబ్ధిదారులు సబ్సిడీ రుణాల కోసం ఫిబ్రవరి 7లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు బ్యాంక్ అనుసంధానంతో సబ్సిడీ రుణాలు ఇస్తామన్నారు. ఏపీబీఎంఎంఎస్ అనే వెబ్‌సైట్‌లో రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మంత్రాలయం: బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో శోభారాణి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ బీసీ కులాలకు మండలంలో 60 యూనిట్లకు రూ.1.14 కోట్లు, ఈబీసీకి 7 యూనిట్లకు రూ.12.50 లక్షలు మంజూరైందని తెలిపారు. ఈ నెల 30నుంచి ఫిబ్రవరి 7వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి ఫారాలను ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

పెద్దకడుబూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న తహసీల్దారు శ్రీనాథ్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్‌యాదవ్, సీపీఐ మండల కార్యదర్శి వీరేష్ డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ముందు ఏఐకేఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మబ్బు ఆంజనేయ, రాజుతో కలిసి వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ పలుమార్లు సమస్యలు పరిష్కరించాలని వినతులు ఇచ్చిన పట్టించుకోవడం లేదన్నారు. ఆర్ఐ జర్మియా సైతం తహసీల్దార్‌కు వత్తాసు పలుకుతూ కుర్చీకే పరిమితమయ్యారన్నారు. అలాగే విలేజ్ సర్వేయర్లు సర్వేలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. డబ్బులు ఇస్తేనే తప్ప పనిచేయని రెవెన్యూ అధికారులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జాఫర్, పటేల్, దస్తగిరి, వీరేష్, మహమ్మద్, రామాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

ఆలయ గోపురం ప్రతిష్ఠ ఉత్సవాలు


హోమం చేస్తున్న పద్మశాలీయులు

కోసిగి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పద్మశాలీయుల ఆరాధ్య దైవమైన మార్కండేయస్వామి ఆలయ నూతన గోపుర గోపురం, కలశ ప్రతిష్ఠ ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పద్మశాలీ సంక్షేమ సేవా సంఘం, యువజన సేవా సంఘం సభ్యులు తెలిపారు. గురువారం ఉదయం మార్కండేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే శుక్ర, శని, ఆదివారాల్లో కూడా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మండలంలోని భక్తులు, పద్మశాలి కులబాంధువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

మంత్రాలయం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం రాంపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్రంలో సంపద సృష్టించి ఆదాయం పెరిగిన తర్వాత సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని చెప్పడం సరికాదన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఆవేశపూరిత మాటలతో రెచ్చగొట్టడం సరికాదన్నారు. ప్రభుత్వం పింఛన్లు పంచడం తప్ప చేసిందేమీ లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ప్రజలకు సంక్షేమపథకాలు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు గురెడ్డి భీమిరెడ్డి, జిల్లా కార్యదర్శి మురళీమోహన్ రెడ్డి, నియోజకవర్గ విద్యార్థి సంఘాల అధ్యక్షుడు ఎల్లప్ప, చెట్నహల్లి వైస్ సర్పంచ్ వీరనాగుడు, హనుమంతరెడ్డి, గౌతమ్, మహబూబ్, జక్కయ్య మారెప్ప, నాగరాజు పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా ముళ్ల కంప

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎర్రకోట గ్రామం నుంచి గువ్వలదొడ్డి, చిన్నమర్రివీడు గ్రామాలకు వెళ్లే రహదారి ముళ్ల కంపలతో నిండిపోయింది. ఈ రహదారి గుండా వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దారికి ఇరువైపులా ముళ్లకంపలు ఉండడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్లకంపలను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు, వాహనదారులు కోరుతున్నారు.


గువ్వలదొడ్డి రహదారిలోకి ఇరువైపులా ఉన్న ముళ్లకంప

టమోటా రేటు ఢమాల్

● ఎమ్మిగనూరు మార్కెట్‌లో 25 కేజీల బాక్స్ రూ.100
● ఖర్చులు కూడా రావటం లేదని రైతుల ఆవేదన

గోనెగండ్ల, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా చుక్కలు చూపిన టమోటా ధర గత 15 రోజులుగా తగ్గు ముఖం పట్టింది. ఎమ్మిగనూరు మార్కెట్‌లో గురువారం 25 కేజీల బాక్స్ రూ.80 నుంచి రూ. 100 వరకు ధర పలికింది. గ్రామీణ మార్కెట్‌లో కిలో టమోటాల ధర పడిపోయింది. వ్యాపారులు రూ. వందకు 10 కేజీల ప్రకారం ఆటోలలో తిరిగి విక్రయిస్తున్నారు. ఒక్కసారిగా కిలో రూ. 30 నుంచి రూ. 10 లకు ధర తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే ఈ ధరలు ఇలాగే ఉంటే సాగుకు అయిన పెట్టుబడులు కూడా రావని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు మండలాలలో దాదాపు 200 ఎకరాల్లో టమోటా పంటను సాగు చేశారు. బావులు, బోర్ల కింద సాగు చేసిన పంట 15 రోజులలో మరో 200 ఎకరాలలోని పంట కోతకు వస్తుంది. దీంతో టమోటా ధర మరింత తగ్గ వచ్చునని వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. నియోజకవర్గంలోని గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు రూరల్ ప్రాంతాలలో సాగు చేసిన టమోటా పంట ఎమ్మిగనూరు మార్కెట్ చేరుతుంది. పంటలు సాగు చేసిన రైతులు మాత్రం ధరను పెట్టుబడులు కూడా రావని మదన పడుతున్నారు.



మంత్రాలయంలో పోటెత్తిన భక్తులు

మంత్రాలయం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. గురువారం రాఘవేంద్రస్వామికి ఇష్టమైన దినం కావటంతో దక్షణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవాల ఊరేగింపులో పాల్గొని భక్తులు పీఠాధిపతి ఆశీస్సులు పొందారు.

చెక్క రథంపై ప్రహ్లాదరాయలు: రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు చెక్క రథంపై విహరించారు. రాఘవేంద్ర స్వామి సజీవ సమాధి పొందిన శుభ దినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుభుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెక్క రథాన్ని వివిధ పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య వజ్రాలు పొదిగిన ప్రహ్లాద రాయలను అధిష్టించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజల మంటపంలో ఊంజలసేవ నిర్వహించారు. అంతకముందు స్వామి వారికి పాదపూజ చేసి పల్లకిలో ఊరేగించారు. పూర్ణ బోధపూజ మందిరంలో పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మూల రాములకు బంగారు నాణేలతో అభిషేకం చేశారు.


మఠం ప్రాంగణంలో రద్దీగా ఉన్న భక్తులు

గాంధీకి ఘన నివాళి


ఎమ్మిగనూరులో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్య వైశ్యులు

మంత్రాలయం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర పోరాట యోధుడు జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని గురువారం ఘనంగా జరుపుకున్నారు. మంత్రాలయం మండలం రాంపురం గ్రామంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, మురళీమోహన్ రెడ్డి, గురెడ్డి భీమిరెడ్డిలు గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో చెట్నహల్లి వైస్ సర్పంచ్ వీరనాగప్ప, హనుమంతరెడ్డి, మారెప్ప, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు జక్కయ్య పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలోని గాంధీ సర్కిల్‌లో మహాత్ముడి విగ్రహానికి ఆర్యవైశ్యులు పూలమాల నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ సుబ్రహ్మణ్యంశెట్టి, కార్యదర్శి ప్రవీణ్ కుమార్ శెట్టి, కాసుల శ్యామ్‌ప్రసాద్ శెట్టి, సభ్యులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి అంజిబాబు మాట్లాడుతూ కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలన్నారు. దేశవ్యాప్తంగా జాతీయ కార్మికుల సంఘాల ఆధ్వర్యంలో వచ్చేనెల 5న నాలుగు లేబర్ కోడ్ బిల్లుల పత్రులను దహనం చేయనున్నట్లు తెలిపారు. ఇందులో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హనుమంతు, రాజు, రవికుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అంజిబాబు

డప్పు కళాకారులను ఆదుకోవాలి


మాట్లాడుతున్న తిమ్మన్న

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పింఛన్ సదుపాయం కల్పించి డప్పు కళాకారులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని డప్పు కళాకారుల సంఘం నాయకులు కోరారు. పట్టణంలోని స్థానిక కేవీపీఎస్ కార్యాలయంలో నల్లన్న అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. డప్పు కళాకారుల జిల్లా ఉపాధ్యక్షుడు తిమ్మన్న, చర్మ కళాకారుల జిల్లా కార్యదర్శి సుమాల అంథోని మాట్లాడుతూ చర్మ, డప్పు కళాకారుల జీవితం దారుణంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం తమ కళాకారులకు రూ. ఎనిమిదివేల పింఛన్ ఇవ్వాలని కోరారు. అలాగే మూడు సెంట్ల స్థలం ఇవ్వాలని కోరారు. బీమా సౌకర్యం కల్పించాలన్నారు. సమావేశంలో గుంటప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే ఉపేక్షించొద్దు : డీఎస్పీ

మంత్రాలయం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అల్లర్లు సృష్టించే వారిని ఉపేక్షించొద్దని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు ఆదేశించారు. గురువారం మండలంలోని మాధవరం పోలీసుస్టేషన్, చెక్‌పోస్టు, తుంగభద్ర రైల్వేస్టేషన్‌లను డీఎస్పీ తనిఖీ చేశారు. కేసులు నమోదు, సిబ్బంది, శాంతిభద్రతలు అదుపు, కర్ణాటక మద్యం, కేసుల పరిష్కారం, పోలీస్‌స్టేషన్‌లో మౌలిక సదుపాయాలు, రౌడీషీటర్ల వివరాలు వంటి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల క్రితం రచ్చుమర్రి గ్రామంలో జరిగిన చోరీ కేసును ఛేదించేందుకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరలో నిందితులను అరెస్టు చేస్తామన్నారు. ఇప్పటికే అనుమానితుల వేలిముద్రణలు సేకరించామన్నారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి ఉంచాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు అవగాహన కల్పించాలన్నారు. గతంలో ఉన్న పెండింగ్ కేసుల్లో పురోగతి సాధించిన మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్సై విజయ్ కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో సిబ్బంది వీరేశ్, భాస్కర్, వీరేశ్, రామకృష్ణ, సోమశేఖర్, రాఘవేంద్ర, హనుమంతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

కరువు ప్రభావిత పంటల వివరాలు సేకరణ


డ్రోన్‌ల సాయంతో కరువు ప్రభావిత ప్రాంతంలో చిత్రాలను తీస్తున్న ఐఐటీ సిబ్బంది

పెద్దకడుబూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పెద్దకడుబూరు మండల పరిధిలోని గవిగట్టు, పీకలబెట్ట గ్రామాల్లో గురువారం ఏవో వరప్రసాద్ ఆధ్వర్యంలో కరువు ప్రభావిత ప్రాంతాల్లోని డ్రోన్‌ల సహాయంతో ఫొటోలను సేకరించారు. ఈ సందర్భంగా ఏవో వరప్రసాద్, ట్రిపుల్‌ఐటీ ప్రొఫెసర్ డాక్టర్ నరేష్‌బాబు మాట్లాడుతూ ఏపీ ఉన్నత విద్యా మండలి వారి సౌజన్యంతో అనంతపురం, కర్నూలు జిల్లాల్లోని కరువు ప్రభావిత ప్రాంతాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. నష్టపోయిన పంటల ఫొటోలను డ్రోన్‌ల సహాయంతో సేకరిస్తున్నట్లు వివరించారు. దీంతో కరువు ప్రభావిత ప్రాంతాన్ని అంచనా వేయడంలో పరిశోధనలు చేయనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల రైతులు, ట్రిపుల్ ఐటీ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటేకల్లు గ్రామానికి చెందిన సామేలు కుటుంబాన్ని టీడీపీ నాయకులు గురువారం పరామర్శించారు. బోడబండ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సామేలుతో పాటు మూడేళ్ల కుమారుడు గౌతమ్ మృతి చెందగా, భార్య శాంతి ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. సామేలు గ్రామంలో టీడీపీ కార్యకర్తగా పనిచేస్తున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సహాయం అందజేయాలని సూచించడంతో మాజీ ఎంపీపీ శంకరయ్య, ఖాజా, నాగయ్య, రాఘవేంద్ర, జగదీష్, కె.టి వెంకటేశ్వర్లు, చెన్నాపురం నాగరాజు, నాగలాపురం డీలర్ ఈరన్న, నరసప్ప బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారాలను అందజేస్తామన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే ఉపేక్షించం


విచారిస్తున్న తహసీల్దారు శ్రీనివాసులు

నందవరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలం ఆక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించమని తహసీల్దారు శ్రీనివాసులు హెచ్చరించారు. సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశాల మేరకు గురువారం మండలంలోని హలహర్వి గ్రామంలో తహసీల్దారు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా దాదాపు 60మంది ఆక్రమించుకున్న స్థలాలను ఆయన పరిశీలించారు. నోటీసులు ఇచ్చిన ఎందుకు స్థలాలను ఖాళీ చేయ లేదని ప్రశ్నించారు. నిజమైన లబ్ధిదారులు ఉంటే న్యాయం చేస్తామన్నారు. అవసరమైతే మరో చోటు స్థలం ఇప్పించే ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ మహేష్, ఆర్ఐ సుబ్బారెడ్డి, వీఆర్వో నతానియేలు, సర్వేయర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

శాఖాహారంతోనే జీవ చైత్యనం

గోనెగండ్ల, జనవరి 30(ఆంధ్రజ్యోతి): శాఖాహారం తీసుకోవడంతోనే ప్రతి మనిషిలో జీవ చైతన్యం ఉత్తేజపడుతుందని పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకులు అంజనేయ శర్మ అన్నారు. గురువారం గోనెగండ్లలో పిరమిడ్ కేంద్రం ఆధ్వర్యంలో ప్రజలు, యువకులు, మహిళలు ర్యాలీ నిర్వహించారు. జీవహింస మహాపాపమని శాఖాహారమే ఉత్తమైన మార్గం అన్నారు. అనంతరం కడపల వీధిలో కడపల రాజు ఆధ్వర్యంలో నిర్మించిన ప్రహ్లాద పిరమిడ్ ధ్యాన మహా శక్తి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు. ఇందుకు ఏకైక మార్గం అహింసా మార్గమన్నారు. ధ్యానం సర్వ రోగాలకు పరిష్కారం చూపుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ధ్యాన కేంద్రాల నిర్వాహకులు ఈరన్న, రాముడు, మహాలక్ష్మి, కోడుమూరు రాఘవరెడ్డి, వేముగోడు పెద్దారెడ్డి, బెళగల్ గోవిందు, కులుమాల రామాంజినేయులు, గార్లదిన్నెరాఘవరెడ్డి, కడపల రాజ్ కుమార్, ప్రజలు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

నిందితులు పరార్, కారు సీజ్

మంత్రాలయం, జరవరి 30(ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి అక్రమంగా మద్యాన్ని తీసుకెళ్తున్న కారును మాధవరం చెక్‌పోస్టు వద్ద ఎస్ఐ విజయ్‌కుమార్ పట్టుకున్నారు. గురువారం మాధవరం సమీపంలో సూగూరు రోడ్‌లో వాగు దగ్గర 11 బాక్సులోని 1056 కర్ణాటక 90 ఎంఎల్ మద్యం టెట్రా ప్యాకెట్లు ఉన్న కారును వదలి ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. కర్ణాటక మద్యంతో పాటు కారును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. కర్ణాటక మద్యం విక్రయించినా, సరఫరా చేసినా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ వీరేష్, రఘు, సోమశేఖర్ ఉన్నారు.

పనికి తగిన కూలి అందిస్తాం: ఎంపీడీవో


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో మణిమంజరి

గోనెగండ్ల, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రతి ఉపాధి కూలీలకు పనికి తగిన కూలి అందజేస్తామని ఎంపీడీవో మణిమంజరి అన్నారు. గురువారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని గ్రామ శివార్లలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీవో పరిశీలించారు. ఏ పనులు చేస్తున్నారు. ఎప్పటి నుంచి చేస్తున్నారు. ఏమైన ఇబ్బందులు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో ఉపాధి పనులు కల్పిస్తున్నామని, ఎవరూ బతుకు తెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లొద్దని కోరారు. అలాగే వలసలు వెళ్లితే అక్కడ జరిగే ఇబ్బందులను గురించి కూలీలకు వివరించారు. అక్కడ వచ్చే కూలీ డబ్బులే ఇక్కడ కూడా వస్తాయన్నారు. పిల్లల భవిష్యత్ కోసమైనా ఆలోచించాలని కోరారు. అలాగే గ్రామాలలో ఉపాధిపనులు చేస్తే రోజుకు రూ. 300 కూలీ వస్తుందని తెలిపారు. సమావేశంలో ఈవోఆర్‌డీ అనంతశయనా, ఏపీవో మహమ్మద్ బాషా, ఫీల్డ్‌అసిస్టెంట్ రఫీక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఐక్యతతో పోరాడుదాం

మంత్రాలయం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్య వ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాడుదామని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి థామస్ అన్నారు. గురువారం మంత్రాలయం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శివాంజల్ సమక్షంలో ఏఐఎస్ఎఫ్-2025 క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా థామస్ మాట్లాడుతూ పోరాడి హక్కులను సాధించుకోవడంలో ఏఐఎస్ఎఫ్ ముందుంటుందన్నారు. తల్లికి వందనం పథకం అమలు చేసి ప్రతి విద్యార్థికి ఏడాది రూ.15వేలు ఇవ్వాలని, ఫీజు రీయింబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్పులు అందించాలని డిమాండ్ చేశారు. వలసలు నివారించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు అరుణాచారి, ఉపేందర్, దస్తగిరి, రాజు, వీరేష్, దివాకర్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి రాజు, తదితరులు పాల్గొన్నారు.

● **కేవీపీఎస్ డైరీ ఆవిష్కరణ:** కేవీపీఎస్ డైరీని మంత్రాలయం ఎస్ఐ శివాంజల్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జయరాజు ఆధ్వర్యంలో డైరీలను ఆవిష్కరించారు. అంటరానితనం నిర్మూలన కోసం పోరాటాలు చేస్తున్న ఏకైక సంఘం కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘమన్నారు. కేవీపీఎస్ ఆవిర్భావం నుంచి ఎన్నో ఉద్యమాలు చేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మన్న, ఇజ్రాయేలు, చిన్న తిక్కన్న, చిన్న ఆంజనేయ, హనుమంతు, మారెప్ప, సురేష్ పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి ప్రాణాంతకం కాదు

కోసిగి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధి ప్రాణాంతకం కాదని వైద్యులు అభిరూప్, మౌనిక అన్నారు. గురువారం కోసిగి మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కుష్ఠు వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గాంధీజీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుష్ఠువ్యాధిపై వైద్యసిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వైద్యుడు అభిరూప్ మాట్లాడుతూ కుష్ఠువ్యాధి ప్రాణాంతకం కాదని, మందులు వాడితే నయమవుతుందన్నారు. శరీరంపై స్పర్శ లేని తనం, రాగి రంగు మచ్చలు ఉన్నట్లు అయితే సంబంధిత వైద్యులను సంప్రదించి, వైద్యం పొందాలని సూచించారు. సమావేశంలో వైద్యసిబ్బంది ఈశ్వరమ్మ, శ్రీనివాసులు, కోటేశ్వరమ్మ, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు, పాల్గొన్నారు.

గోనెగండ్ల: సమాజంలో వ్యాపిస్తున్న వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని వైద్యులు రుక్సానా, అపర్ణ సూచించారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13వరకు కుష్ఠువ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా గురువారం గోనెగండ్లలో వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు రక్సానా, అపర్ణ మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి లక్షణాలను వివరించారు. ఆరోగ్య కార్యకర్తలు పరీక్షిస్తారని, వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సిబ్బంది హనుమంతు, పరమేశ్వరప్ప, విజయభారతి, ఎఎన్ఎం, ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.


కోసిగి పంచాయతీ కార్యాలయంలో కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు